నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 11-2-2022 RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :28 సంచిక: 158 పేజీలు: 4 వెల: రూ.1/-

హిజాబ్ వివాదంపై ఇప్పుడే జోక్యం చేసుకోలేం: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: కర్నాటకలో ముస్లిం విద్యార్థినులు హిజాబ్ ధరించి కాలేజీకి వెళ్తున్న ఘటనపై ఆ రాష్ట్రంలో వివాదం చెలరేగిన విషయం తెలిసిందే. ఉడిపి జిల్లాలోని ప్రభుత్వ కాలేజీకి అమ్మాయిలు హిజాబ్ వేసుకుని కాలేజీకి వెళ్లడాన్ని నిరసిస్తూ మిగితా విద్యార్థులు కాషాయ కండువాలతో నిరసన ప్రదర్శన చేపట్టారు. ప్రస్తుతం ఆ రాష్ట్రంలో హిజాబ్ వివాదంపై కేసు విచారణకు ఉన్నది. అయితే ఈ మ్యాటర్‌ను తక్షణమే విచారణకు స్వీకరించాలని ఇవాళ సుప్రీంకోర్టులో కపిల్ సిబల్ కోరారు. ప్రస్తుతం ఆ కేసు కర్నాటక హైకోర్టులో ఉందని, అక్కడ విచారణ పూర్తి కావాలని, ఇప్పుడే ఆ అంశంలో మేం జోక్యం చేసుకోవడం సరికాదు అని సీజేఐ ఎన్వీ రమణ అన్నారు. కర్నాటక హైకోర్టులో ఉన్న పిటిషన్‌ను ట్రాన్స్‌ఫర్ చేయాలని కపిల్ సిబల్ అభ్యర్థించారు. 9 మంది సభ్యుల ధర్మాసనం ముందు ఆ అంశాన్ని విచారించాలన్నారు.

హైకోర్టుకు చెందిన త్రిసభ్య ధర్మాసనం ఈ కేసును విచారిస్తున్నదని, వాళ్లకు కనీసం ఒక్క రోజైనా సమయం ఇవ్వాలని చీఫ్ జస్టిస్ ఎన్వీ రమణ తెలిపారు. ఈ కేసులో ఇప్పుడే జోక్యం చేసుకోలేమని ఆయన స్పష్టం చేశారు. కర్నాటక హైకోర్టులో చీఫ్ జస్టిస్ రీతూ రాజ్ అవాస్తి, జస్టిస్ కృష్ణదాస్ దీక్షిత్, జస్టిస్ జేఎం ఖాజీలతో కూడిన ధర్మాసనం హిజాబ్ పిటిషన్‌ను విచారించనున్నది.

తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని చాటాలే.. సీఎం సభకు లక్షలాదిగా తరలిరావాలే: మంత్రి ఎర్రబెల్లి

వరంగల్.ఫిబ్రవరి 10:కరువు జిల్లాగా ఉన్న జనగామను సస్య శ్యామలం చేసి, అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రేపు జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయం, టి.ఆర్.ఎస్ పార్టీ ఆఫీసు ప్రారంభం చేయడానికి వస్తున్న సందర్భంగా జిల్లా ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి సీఎం కేసీఆర్‌కు ఘన స్వాగతం పలకాలని మంత్రులు ఎర్రబెల్లి దయాకరరావు, సత్యవతి రాథోడ్ కోరారు. ప్రధాని పార్లమెంట్ లో తెలంగాణ ఏర్పాటుపై అక్కసు వెళ్లగక్కిన నేపథ్యంలో మండిపడుతున్న తెలంగాణ ప్రజలు రేపటి సభకు భారీ ఎత్తున తరలిరావాలని కోరారు. ప్రధానికి చరిత్ర తెలువకుండా మాట్లాడితే?ఉద్యమ ఓనమాలు తెలువని రాష్ట్ర బీజేపీ నేతలు ప్రధాని మాటలు సమర్థించడం కంటే సిగ్గుమాలిన చర్య ఇంకొకటి ఉండదు అన్నారు.

జనగామ జిల్లాను ఇచ్చి, అన్నివిధాల అభివృద్ధి చేసి జిల్లాకు వస్తున్న సందర్భంగా సీఎం కేసీఆర్‌కు రేపు ఘన స్వాగతం పలుకుతున్నాం. రేపు జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయం, బహిరంగ సభ ఏర్పాట్లను మంత్రులు పరిశీలించారు. సమావేశంలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి, వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ వాసుదేవ రెడ్డి, టీఎస్ఐఐసి చైర్మన్ గ్యాదరి బాలమల్లు, ఇతర నాయకులు ఉన్నారు.

చెరువులు, బావులు ఎండి పోయాయి. జనగామ కరువు జిల్లాగా ఉండేది. కానీ మిషన్ భగీరథ, దేవాదుల ద్వారా తాగునీరు, సాగునీరు పుష్కలంగా వస్తోంది అంటే అది సీఎం కేసీఆర్ కృషి ఫలితమేనన్నారు.

కేంద్రం ఎంత చిన్న చూపు చూసినా తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో నంబర్ వన్ అయ్యింది. గుజరాత్ ను మించి పోయింది. సాగునీరు, పంటలు, కరెంట్, ఐటీ, పరిశ్రమల్లో తెలంగాణ నంబర్ వన్. ఇది మేము చెప్పింది కాదు. బీజేపీ కేంద్ర మంత్రులు పార్లమెంట్ లోనే ఇవన్నీ చెప్పారు. రేపు 70, 80 వేల మందితో సభ పెట్టాలనుకున్నాం.. కానీ, మోడీ విమర్శల నేపథ్యంలో ఈ ప్రాంత ప్రజలు పెద్ద ఎత్తున రావాలని పట్టుదలతో ఉన్నారు. ఇపుడు లక్షా 30 వేల మంది స్వచ్ఛందంగా రానున్నట్టు మాకు సమాచారం ఉంది. మహిళలు, రైతులు, యువత, పెన్షనర్లు పెద్ద ఎత్తున్న వస్తున్నారు. అని మంత్రి ఎర్రబెల్లి అన్నారు. కాగా, ఈసందర్భంగా జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయం, పార్టీ కార్యాలయం ప్రారంభం చేసిన తర్వాత పార్టీ అధ్యక్షుడు పదవీ బాధ్యతలు తీసుకుంటారు. అనంతరం సీఎం కేసీఆర్ బహిరంగ సభ ఉంటుందని ఎర్రబెల్లి అన్నారు. గతంలో

తెలంగాణపై విషం చిమ్మడమే మోదీ పని.. మంత్రి హరీశ్‌రావు ఫైర్

వరంగల్, ఫిబ్రవరి 10:: ప్రధాని నరేంద్ర మోదీపై రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. అప్పుడు తల్లిని చంపి బిడ్డను బతికించారు అన్నరు.. ఇప్పుడు రాష్ట్ర ఏర్పాటు సక్రమంగా జరగలేదు అంటున్నారు.. తెలంగాణపై ఎప్పుడు విషం చిమ్మడమే మోదీ పని మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు.

హనుమకొండలో టీ డయాగ్నోస్టిక్, రేడియాలజీ ల్యాబ్‌కు శంకుస్థాపన చేసిన సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. మొన్న తెలంగాణ ఉద్యమాన్ని, ఉద్యమకారుల బలిదానాలను కించపరిచారు అని కోపోద్రిక్తులయ్యారు. ప్రత్యేక రాష్ట్రం కోసం వరంగల్ జిల్లాకు చెందిన ఎంతో మంది ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. తెలంగాణకు కేంద్రం ఏం ఇచ్చింది? అని ప్రశ్నించారు. వరంగల్‌కు కోచ్ ఫ్యాక్టరీ ఎందుకు ఇవ్వలేదు? దేశవ్యాప్తంగా 157 మెడికల్ కాలేజీ ఇస్తే తెలంగాణకు ఒక్కటి కూడా కేటాయించలేదు. నవోదయ పాఠశాలలు, ఐఐఎం, ఐఐఐటీ, ఒక్కటి ఇవ్వలేదు. అన్నింటా తెలంగాణకు మొండి చేయి చూపారు అని మంత్రి హరీశ్‌రావు ధ్వజమెత్తారు.

తెలంగాణ అంటే బీజేపీకి కడుపు నిండా విషం..

తెలంగాణ అంటే భారతీయ జనతా పార్టీకి కడుపు నిండా విషం ఉంటుందన్నారు. బీజేపీకి తెలంగాణలో నూకలు చెల్లినయి అని పేర్కొన్నారు. నిధులు ఇవ్వకుండా సూటిపోటి మాటలు మాట్లాడటం సరికాదన్నారు. బీజేపీ ఎన్ని కుట్రలు చేసినా రాష్ట్రం పురోగతిలో ఉంటుంది.. అభివృద్ధి ఆగదు అని హరీశ్‌రావు తేల్చిచెప్పారు.

మా పని తీరు కళ్లకు కనిపిస్తలేదా..?

ఎంపీలు దత్తత తీసుకున్న గ్రామాల అభివృద్ధిలో టాప్ 10లో దేశంలో 7 తెలంగాణ గ్రామాలు ఉన్నాయి. వివిధ రంగాల్లో కేంద్రం నుండి అనేక అవార్డులు వచ్చాయి. ఇది మా పని తీరు.. కళ్లకు కనిపిస్తలేదా? అని హరీశ్‌రావు ప్రశ్నించారు. మోదీ ఇంకో మాట అంటారు.. రాష్ట్రాలు, కేంద్రం కలిసి ఉండాలని.. నీతులు బాగానే చెబుతాడు. కానీ చేతల్లో మాత్రం చూపించరు అని విమర్శించారు.

ఎందుకు మా ఏడు మండలాలు ఆదరాబాదరాగా ఆంధ్రాలో కలిపారు. ఎందుకు సీలేరు ప్రాజెక్టు అప్పగించారు. నువు చేస్తే ఒప్పు.. మేము చేస్తే తప్పా? అని హరీశ్‌రావు నిలదీశారు. మోదీ వ్యాఖ్యలను జర్నలిస్టు సంఘాలు కూడా తీవ్రంగా ఖండించాలి. తెలంగాణ ఉద్యమంలో వరంగల్ జర్నలిస్టులు కీలక పాత్ర పోషించారు అని హరీశ్‌రావు గుర్తు చేశారు.

లోక్‌సభ పోడియం వద్ద టీఆర్ఎస్ ఎంపీల ఆందోళన

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: తెలంగాణ రాష్ట్ర సమితి ఎంపీలు ఇవాళ లోక్‌సభలో ఆందోళన చేపట్టారు. సాయంత్రం 4 గంటలకు సభ ప్రారంభమైన తర్వాత.. వెల్‌లోకి దూసుకువెళ్లి నిరసన చేపట్టారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై ప్రధాని మోదీ రెండు రోజుల క్రితం అసంబద్ధ వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీపై టీఆర్ఎస్ పార్టీ సభా హక్కుల ఉల్లంఘన నోటీసు ఇచ్చింది. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాతో పాటు లోక్‌సభ సెక్రటరీ జనరల్‌కు ఆ నోటీసులు అందజేశారు. ఇవాళ టీఆర్ఎస్ ఎంపీలు ప్లకార్డులతో వెల్‌లో నిరసన ప్రదర్శన చేపట్టారు. నామా నాగేశ్వరరావు నేతృత్వంలో లోక్‌సభ ఎంపీలు ఆందోళన నిర్వహించారు.

ఇవాళ ఉదయం రాజ్యసభలోనూ టీఆర్ఎస్ ఎంపీలు ప్రధాని మోదీపై సభా హక్కుల ఉల్లంఘన నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాజ్యసభలో తెలంగాణ ఎంపీలు సభ నుంచి వాకౌట్ కూడా చేశారు. అయితే ప్రివిలేజ్ నోటీసుపై చైర్మెన్ నిర్ణయం తీసుకుంటారని డిప్యూటీ చైర్మెన్ హరివంశ్ తెలిపారు.

పుదుచ్చేరిలో త్వరలో విద్యార్థులకు డ్రెస్‌కోడ్ అమలు: తమిళిసై

పుదుచ్చేరి, ఫిబ్రవరి 10:: కేంద్ర పాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో విద్యార్థులకు త్వరలో డ్రెస్ కోడ్ అమలులోకి రానున్నది. ఈ విషయాన్ని లెఫ్టినెంట్ గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ గురువారం స్పష్టం చేశారు. విద్యార్థులకు యూనిఫాం డ్రెస్ కోడ్‌ను రూపొందించే పనిలో విద్యా శాఖ నిమగ్నమై ఉన్నదని చెప్పారు. హిజాబ్ ధరించి స్కూల్ వచ్చిన ఒక విద్యార్థినిని అడ్డుకుని హిజాబ్ తొలగించాలని హెడ్ మాస్టర్ చెప్పడంతో కర్ణాటకలో తీవ్ర వివాదంగా మారింది. ఈ నేపథ్యంలో లెఫ్టినెంట్ గవర్నర్ ప్రకటన వెలువడటం విశేషం సంతరించుకున్నది.

డ్రెస్ కోడ్ యూనిఫాం అనుమతించే కొన్ని విషయాలపై వివరణాత్మక మార్గదర్శకాలు ఉంటాయని పుదుచ్చేరి విద్యా శాఖ డైరెక్టర్ పీఆర్ రుద్రాగౌడ్ తెలిపారు. ప్రభుత్వం ప్రతిపాదనను ఆమోదించిన తర్వాత విద్యార్థుకు డ్రెస్‌కోడ్‌ను అమలు చేస్తామని చెప్పారు. పొరుగు రాష్ట్రమైన కర్ణాటకలో హింసాత్మకంగా మారిన హిజాబ్ ఆందోళనపై లెఫ్టినెంట్ గవర్నర్‌తో పాటు ఆ ప్రాంత ముఖ్యమంత్రి ఎన్ రంగస్వామికి పుదుచ్చేరి రాజకీయ పార్టీలు తమ ఆందోళనను తెలియజేశాయి. పుదుచ్చేరిలో అలాంటి సమస్య తలెత్తకుండా చూడాలని అభ్యర్థించాయి.

స్వతంత్ర ఎమ్మెల్యేలు కొందరు తనను కలిసి కేంద్ర పాలిత ప్రాంత అభివృద్ధికి సంబంధించి కొన్ని ప్రతిపాదనలపై చర్చించారని లెఫ్టినెంట్ గవర్నర్ ఒక ప్రకటనలో తెలిపారు. నలుగురు స్వతంత్ర ఎమ్మెల్యేలు లెఫ్టినెంట్ గవర్నర్‌ను కలవడం సంచలనంగా మారింది. ఈ నలుగురు ఎమ్మెల్యేలు సీఎం ఎన్ రంగస్వామికి మద్దతుగా నిలిచారు. ఈ నలుగురు రంగస్వామి ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకుంటున్నారనే పుకార్లు వ్యాపించడంతో కలకలం చెలరేగింది.

లోక్‌సభను స్తంభింపజేసిన టీఆర్ఎస్.. ప్రధాని మోడీకి సభాహక్కుల నోటీసు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: తెలంగాణ ఏర్పాటుపై ప్రధాన మంత్రి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ టీఆర్ఎస్ ఆందోళనను ఉధృతం చేసింది. గురువారం లోక్‌సభ సభ్యులు లోక్‌సభ సెక్రటరీ జనరల్‌కు, రాజ్యసభ సభ్యులు రాజ్యసభ సెక్రటరీ జనరల్‌కు ప్రధాన మంత్రి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ సభాహక్కుల నోటీసును అందజేశారు. అనంతరం టీఆర్ఎస్ ఎంపీలు లోక్‌సభలో గందరగోళం సృష్టించారు. ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలను వాకౌట్ చేస్తున్నట్టు ప్రకటించి ఎంపీలు లోక్‌సభ నుంచి బయటకు వచ్చారు. ఆ తర్వాత టీఆర్ఎస్, లోక్‌సభ పార్లమెంట్ ఎంపీలు తెలంగాణా భవన్‌కు చేరుకుని అక్కడి అమరవీరుల స్థూపం వద్ద ఆందోళన నిర్వహించారు.

జై తెలంగాణ, మోడీ డౌన్ డౌన్, కేసీఆర్ నాయకత్వం వర్ధిల్లాలంటూ నినాదాలు చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో టీఆరెస్ పార్లమెంట్ సభ్యులు కె.కేశవరావు, నామా నాగేశ్వరరావు, కెప్టెన్ లక్ష్మీ కాంతరావు, బడుగు లింగయ్య యాదవ్, మన్నె శ్రీనివాసరెడ్డి, పి.రాములు, వెంకటేష్ నేత, రంజిత్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం వారు తెలంగాణ భవన్‌లోని గురజాడ కాన్ఫరెన్స్ హాల్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి ప్రధాని మోడీ తీరును ఎండగట్టారు.

6 రాష్ట్రాల్లో అత్యధిక సంఖ్యలో కోవిడ్ కేసులు: కేంద్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: భారతదేశంలో అత్యధిక సంఖ్యలో కోవిడ్-19 కేసులు నమోదవుతున్నరాష్ట్రాల పేర్లను కేంద్ర ప్రభుత్వం గురువారం విడుదల చేసింది. ఫిబ్రవరి 9తో ముగిసిన వారంలో 2,16,876 కేసులతో కేరళలో అత్యధికంగా 32.3శాతం వీక్లీ పాజిటివ్ రేటు నమోదైంది. దీని తర్వాత మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, మధ్యప్రదేశ్ మరియు రాజస్థాన్ రాష్ట్రాలు ఉన్నాయి. అన్ని రాష్ట్రాల్లో కేసులు మరియు పాజిటివిటీ రేటు తగ్గుముఖం పడుతోందని కేంద్ర ప్రభుత్వం తెలిపింది.

శుభం కార్డు పడింది.. ఈ నెలఖారులోనే జీవో : చిరంజీవి

హైదరాబాద్, ఫిబ్రవరి 10:తెలుగు సినిమా ఇండస్ట్రీలో నెలకొన్న సమస్యలకు ఈ రోజు శుభం కార్డు పడిందని సంతోషంతో చెప్తున్నాం అని మెగాస్టార్ చిరంజీవి స్పష్టం చేశారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి జగన్‌తో సమావేశం అనంతరం చిరంజీవి మీడియాతో మాట్లాడారు. సినీ పరిశ్రమలో నెలకొన్న సమస్యలపై చర్చించేందుకు తమను ఆహ్వానించిన సీఎం జగన్‌కు ఇండస్ట్రీ తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నాను. తక్కువ ధరకు ప్రజలకు వినోదం అందాలనేది సీఎం ఉద్దేశం. సమస్యలపై చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. సీఎం నిర్ణయం మమ్మల్ని అందర్నీ సంతోషపరిచింది. ఈ నెలఖారులోనే జీవో వస్తుందని భావిస్తున్నాను అని చిరంజీవి తెలిపారు.

చిన్న సినిమాలకు ఐదో షోకు అనుమతి

సీఎం జగన్ చిన్న సినిమాల మీద దృష్టి సారించారు. ఈ సినిమాలు కూడా విజయవంతం కావాలనే ఉద్దేశంతో.. ఆయన మా అందరి కోరికను మన్నించి ఐదో షోకు అనుమతించారు. దీని వల్ల చిన్న నిర్మాతలకు, ఇతరులకు ఎంతో వెసులుబాటు కలుగుతుంది అని చిరంజీవి పేర్కొన్నారు.

ప్రపంచ వ్యాప్తంగా తెలుగు సినిమాలకు కీర్తి..

భారతదేశంలో మన తెలుగు సినిమాలను గొప్పగా చెప్పుకుంటున్నారు.. కీర్తిస్తున్నారు అని చిరంజీవి పేర్కొన్నారు. పెద్ద బడ్జెట్‌తో మన నిర్మాతలు సినిమాలు చేస్తున్నారు. దేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా మన సినిమాలకు మంచి పేరు వస్తుంది. సినిమాటోగ్రఫి మంత్రి పేర్ని నాని ఎప్పటికప్పుడు చర్చలు జరిపి ఇండస్ట్రీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించారు. నాని తీసుకున్న చర్యల వల్లే సమస్యలకు శుభం కార్డు పడిందన్నారు.

వైజాగ్‌ను షూటింగ్‌లకు అనుకూలంగా..

తెలంగాణలో చిత్ర పరిశ్రమ అభివృద్ధి చెందిన మాదిరిగానే ఏపీలో అభివృద్ధి చెందాలని సీఎం జగన్ ఆకాంక్షించినట్లు చిరంజీవి తెలిపారు. దానికి కావాల్సిన అన్ని అవకాశాలను కలుగుజేస్తానని చెప్పారు. వైజాగ్‌ను షూటింగ్‌లకు అనుకూలంగా తీర్చిదిద్దుతామన్నారు. సినీ పరిశ్రమకు తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని సీఎం చెప్పినట్లు చిరంజీవి స్పష్టం చేశారు.

బాధితురాలైన ప్రతి ముస్లిం మహిళకు భాజపా ప్రభుత్వం అండగా నిలుస్తోంది: ప్రధాని

లక్నో, ఫిబ్రవరి 10:: ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఎన్నికల ప్రచారం చేశారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో సహరాన్‌పూర్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ బాధితురాలైన ప్రతి ముస్లిం మహిళకు బీజేపీ ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. ప్రతిపక్షాలు తమ హక్కులను కాపాడుకోవడానికి, ఓట్ల కోసం అనేక మార్గాలను అన్వేషిస్తున్నాయని మోదీ అన్నారు. ముస్లిం కుమార్తెల జీవితం ఎప్పుడూ వెనుకబడి ఉండేలా ఆ వ్యక్తులు ముస్లిం సోదరీమణులను మోసగిస్తున్నారని మోదీ విమర్శించారు.

నేటి నుంచి పాత గుట్ట బ్రహ్మోత్సవాలు

యాదాద్రి, ఫిబ్రవరి 10 : యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రానికి అనుబంధ ఆలయంగా కొనసాగుతున్న పాతగుట్ట లక్ష్మీనరసింహస్వామి వారి సన్నిధిలో వార్షిక బ్రహ్మోత్సవాలు రేపు (శుక్రవారం) ప్రారంభం కానున్నాయి. ఈ నెల 17 వరకు కొనసాగనున్న బ్రహ్మోత్సవాలకు శుక్రవారం ఉదయం 9గంటలకు స్వస్తివాచనంతో శ్రీకారం చుట్టనున్నట్లు ఆలయ ఈఓ ఎన్.గీత గురువారం మీడియాతో తెలిపారు. 12న ఉదయం 10 గంటలకు ధ్వజారోహణం, 13న రాత్రి 8 గంటలకు ఎదుర్కోలు, 14న రాత్రి 8 గంటలకు స్వామివారి కల్యాణోత్సవం (గజవాహనం) నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 15న రాత్రి 8 గంటలకు రథోత్సవం, 17న ఉదయం 9 గంటలకు స్వామివారి శతఘటాభిషేకం, మధ్యాహ్నం ఒంటి గంటకు మహదాశీర్వచనం, పండిత సన్మానంతో ఉత్సవాలకు పరిసమాప్తి పలుకుతామని పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆమె వివరించారు.

రైతు కుటుంబాలకు పరిహారం చెల్లింపులో జాప్యంపై హైకోర్టు ఆగ్రహం

హైదరాబాద్, ఫిబ్రవరి 10: ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు పరిహారం అంశంపై నేడు హైకోర్టులో విచారణ జరిగింది. సిద్దిపేట సామాజిక కార్యకర్త కొండల్‌రెడ్డి వేసిన పిల్‌పై విచారణ జరిపిన ఉన్నత న్యాయస్థానం? రైతు కుటుంబాలకు పరిహారం చెల్లింపులో జాప్యంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఏప్రిల్ 6న రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. రూ.6 లక్షలు చెల్లించేలా 2015లో ప్రభుత్వం జీవో ఇచ్చిందని పిటిషనర్ కోర్టుకు తెలిపారు.

జీవో జారీ చేసి ఆరేళ్లు దాటినా పరిహారం చెల్లించలేదని వెల్లడించారు. పలు జిల్లాల్లో రైతు కుటుంబాలకు పరిహారం అందాల్సి ఉందని కోర్టుకు తెలియజేశారు. ఈ విషయంపై గడువు కావాలన్న ప్రభుత్వ న్యాయవాది అభ్యర్థనపై హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది. జీవోలు జారీ చేసి తర్వాత ప్రక్రియ వదిలేశారని హైకోర్టు వ్యాఖ్యానించింది. చనిపోయిన రైతుల కుటుంబాలు రోజూ ఇబ్బంది పడాలా అని ధర్మాసనం ప్రశ్నించింది. తదుపరి విచారణను ఏప్రిల్ 6కు వాయిదా వేసింది.

ప్రధానిపై ప్రివిలేజ్ నోటీసు.. రాజ్యసభ నుంచి టీఆర్ఎస్ వాకౌట్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: రాజ్యసభ నుంచి ఇవాళ టీఆర్ఎస్ ఎంపీలు వాకౌట్ చేశారు. తెలంగాణ బిల్లుపై ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని టీఆర్ఎస్ ఎంపీలు ఇవాళ సభా హక్కుల ఉల్లంఘన నోటీసులు ఇచ్చారు. ఇవాళ సభా కార్యక్రమాలు ప్రారంభం కాగానే.. టీఆర్ఎస్ ఎంపీలు వెల్‌లోకి దూసుకువెళ్లారు. సురేశ్ రెడ్డి, సంతోష్ కుమార్, బడుగల లింగయ్య యాదవ్‌లు వెల్‌లోకి వెళ్లి నిరసనలు వ్యక్తం చేశారు. ప్రధానిపై ఇచ్చిన ప్రివిలేజ్ మోషన్‌పై నిర్ణయం తీసుకోవాలని ఎంపీ కేశవరావు డిప్యూటీ చైర్మెన్ హరివంశ్‌ను కోరారు. ఆ సందర్భంలో ఆయన స్పందిస్తూ.. సభా హక్కుల నోటీసు అందిందని, కానీ దానిపై చైర్మెన్ వెంకయ్య నిర్ణయం తీసుకుంటారని హరివంశ్ తెలిపారు. చైర్మెన్ పరిశీలన కోసం ప్రివిలేజ్ నోటీసును పంపినట్లు ఆయన చెప్పారు. కాంగ్రెస్ తో పాటు ఇతర విపక్షాలు కూడా టిఆర్ఎస్ వాదనతో ఏకీభవించాయి. రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖార్గే కూడా టిఆర్ఎస్ కు మద్దతు పలికారు. ప్రివిలేజ్ నోటీసుపై ఛైర్మన్ నిర్ణయం తీసుకునే వరకు సభకు వెళ్లరాదని తెరాస ఎంపీలు నిర్ణయం తీసుకున్నారు. ఆ తర్వాత రాజ్యసభ నుంచి వాకౌట్ చేశారు.

రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే ప్రధానమంత్రి తీరుపై మండిపడ్డారు. తెలంగాణ ఏర్పాటుపై ప్రధాన చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు? అదేవిధంగా ఎనిమిదేళ్ల తర్వాత కూడా ప్రధాని మీడియా సమావేశంలో ప్రశ్నల వర్షం కురిపించకుండా, మీడియాకు ఇచ్చే ఇంటర్వ్యూలపైనే ఆధారపడాల్సి రావడం సిగ్గుచేటు అన్నారు. రెండు సభల్లో పాసైన బిల్లుపై ప్రధాని కామెంట్ చేయడం శోచనీయమన్నారు.ప్రధాని మోదీపై లోక్‌సభలో కూడా ప్రివిలేజ్ నోటీసు తెరాస ఎంపీలు ఇవ్వనున్నారు. ఈ మధ్యాహ్నం స్పీకర్‌ను కలిసి ప్రివిలేజ్ నోటీసు ఇస్తారు. సాయంత్రం 4గం.లకు సభ ప్రారంభమైన అనంతరం నిరసన తెలపాలని నిర్ణయించినట్లు సమాచారం. ప్రివిలేజ్ నోటీసుపై స్పీకర్ నిర్ణయం తీసుకునే వరకు సభను బాయ్‌కాట్ చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.

ఎన్నికలు రావడమే ఆలస్యం.. మోదీ సాధువు అయిపోతారు : మమత ఎద్దేవా

బెంగాల్. ఫిబ్రవరి 10:ప్రధాని నరేంద్ర మోదీపై బెంగాల్ సీఎం తీవ్రంగా విరుచుకుపడ్డారు. సరిగ్గా ఎన్నికల సమయం వచ్చే నాటికి మోదీ సాధువు అవతారం ఎత్తుతారంటూ ఫైర్ అయ్యారు. ఓ వైపు దేశంలో హిందూ ధర్మం క్షీణిస్తోందని, అయినా ఎన్నికల్లో ఓట్ల కోసం మోదీ సాధువు అవతారం ఎత్తుతున్నారని విమర్శించారు. మైనారిటీల హక్కులను బీజేపీ ప్రభుత్వం కాలరాస్తోందని, చరిత్ర, సత్యాలకు కూడా వక్రభాష్యాలు చెబుతోందంటూ మండిపడ్డారు.

మోదీ ప్రభుత్వం ప్రతి దాన్నీ ధ్వంసం చేస్తోందని, చరిత్రను కూడా మార్చుతోందని ఆమె ఆరోపించారు. బీజేపీ పాలనలో దళితులు, ఆదివాసీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆమె పేర్కొన్నారు. ఢిల్లీలోని అమరజవాన్ జ్యోతిని తీసేసి, నేతాజీ హోలోగ్రామ్‌ను ఏర్పర్చారని, ఇప్పుడు హోలోగ్రామ్ కూడా పోతోందని మమత ఎద్దేవా చేశారు. ఎన్నికలు దగ్గరపడుతున్న సమయంలోనే బీజేపీ వారికి స్వాతంత్ర సమరయోధులు గుర్తుకు వస్తారని మమతా ఎద్దేవా చేశారు.

సీఎం కేసీఆర్‌కు ఘనస్వాగతం పలకాలి : మంత్రి సత్యవతి

జనగామ, ఫిబ్రవరి 10: : జిల్లా పర్యటనకు వచ్చే సీఎం కేసీఆర్‌కు ఘన స్వాగతం పలకాలని రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ పిలుపునిచ్చారు. గురువారం జనగామలో ఆమె మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. సీఎం కేసీఆర్ జనగామ పర్యటనకు వస్తున్నారని, ఈ సందర్భంగా జిల్లా ప్రజలు, పార్టీ శ్రేణుల తరపున స్వాగతం పలుకుతున్నామన్నారు. గతంలో సీఎం కేసీఆర్ సభ వాయిదా పడింది, ఈ క్రమంలోనే కేసీఆర్ రాక కోసం జిల్లా ప్రజలంతా ఆశగా ఎదురుచూస్తున్నారన్నారు.

ఎడారిగా ఉన్న జిల్లా కేసీఆర్ నాయకత్వాన ఇప్పుడు సస్యశ్యామలమైందన్నారు. గతంలో తెలంగాణ వస్తే ఏం వస్తుందన్న వారికి.. రేపు ప్రారంభించే సమీకృత కలెక్టరేట్, ఇప్పటికే వచ్చిన సాగు, తాగునీరు ఎలా వచ్చింది చూస్తే అర్థమవుతుందన్నారు. కరువు జిల్లాలో ఇకపై నీళ్లు రాని ఊరు ఉండొద్దని సీఎం కేసీఆర్ చెప్పారని, అవసరమైతే లిఫ్ట్ ఇరిగేషన్ పెట్టి ఇవ్వాలన్నారని మంత్రి తెలిపారు. ఫలితంగా నేడు రైతులు పంటలు పండిస్తున్నారని, దేశంలో ఒకే పంటలోనే అత్యధికంగా దిగుబడి సాధించిన రాష్ట్రంగా తెలంగాణ రికార్డు సాధించిందన్నారు.

చరిత్ర తెలియని వ్యక్తి ప్రధానిగా ఉండడం దురదృష్టకరం

చరిత్ర తెలియని వ్యక్తి దేశానికి ప్రధానిగా ఉండడం దురదృష్టకరమని సత్యవతి రాథోడ్ విమర్శించారు. తెలంగాణపై బీజేపీ అన్యాయంగా మాట్లాడుతుందని, రాష్ట్రాన్ని అన్యాయంగా ఇచ్చినట్లు ప్రధాని అంటున్నారని ఆరోపించారు. ఎవరితో సాధ్యం కాని తెలంగాణ.. కేసీఆర్‌తో సాధ్యమైందన్నారు. అలాగే దేశంలోని నాయకులను కూడగట్టుకొని తన పదవికి ఎసరు పెడతారని భావించి అక్కసు వెళ్లగక్కుతున్నారన్నారు. సీఎం కేసీఆర్

నానో టెక్నాలజీతో శాస్త్రసాంకేతికత కొత్తపుంతలు

పాతరాతి యుగంతో ప్రారంభమైన మానవ పరిణామక్రమంలో ప్రస్తుతం డిజిటల్ ప్రపంచంలో నానోటెక్నాలజీ విప్లవం ఆధునిక మానవున్ని మరో సాంకేతిక లోకంలోకి తీసుకెళుతోంది. నానో విప్లవ ఆగమనంతో మానవజీవితంలో పెను మార్పులు చోటు చేసుకుంటున్నాయి. మనకు తెలిసిగాని, తెలియకగాని, ప్రతి ఒక్కరు నానోటెక్నాలజీని వినియోగించటం అనివార్యమైంది.

ఘన ద్రవ వాయు పదార్థాలన్ని అణుపరమాణు నిర్మితాలని, పరమాణువుల్లో మౌళిక కణాలైన ఎలక్ట్రాన్, ప్రోటాన్, న్యూట్రాన్లు ఉంటాయని మనందరికీ విదితమే.

సాధారణ పదార్థాలలో కణపరిమాణము మైక్రాన్ లేదా అంతకన్న ఎక్కువగా ఉంటుంది. ఈ పదార్థాలు త్రిమితీయ ఆకృతులు కలిగి తమ స్వాభావిక ధర్మాలను ప్రదర్శిస్తాయి. పదార్థ కణపరిమాణాన్ని 100 నానో మీటర్లలోపుకు నియంత్రించినపుడు అవి ప్రదర్శించే ధర్మాలు విలక్షణంగా, విచిత్రంగా ఉంటాయని ఆచార్య రిచర్డ్ ఫెన్మన్ 1959లో గుర్తించాడు. దీనికి స్పందించిన శాస్త్ర సమాజం 1965లో అతనికి నోబెల్ బహుమతిని కూడా ప్రదానం చేయడం సముచితంగా ఉంది. ఫెన్మన్ ఆవిష్కరణల తరువాత ఈ దృగ్విషయానికి 'నానోటెక్నాలజీ' అని 1974లో 'ఆచార్య నోరియో తనుగుచ్చి' నామకరణం చేశాడు. ఫెన్మన్ ఆలోచనల ప్రకాపం నానోటెక్నాలజీ సహాయంతో ప్రపంచ సమాచారాన్నంత ఒక ఎన్వలపులో బంధించవచ్చన్నారు. అతని ఊహ ప్రకారం నానో ఇంజన్లను రక్తనాళాల్లోకి ప్రవేశ పెట్టి శస్త్రచికిత్సలు జరిపే రోజులు వస్తాయన్నారు. నానోమెటీరియల్స్ రూపకర్తలు బిన్నింగ్, రోరర్ కలిసి చేసిన కృషికి మెచ్చి 1986లో నోబెల్ పురస్కారము ప్రదానం చేశారు.

నానోటేక్నాలజీ అంటే?:

అణుపరమాణు పరిమాణము 100 నానోమీటర్ల కన్న తక్కువగా ఉన్నపుడు జనించే అసాధారణ ధర్మాలు, విలక్షణ అనువర్తనాలు, ఆధునిక పరికరాల రూపకల్పన వంటి అంశాలను చర్చించే వైజ్ఞానిసశాస్త్ర విభాగాన్ని నానో సైన్స్ అని, వీటి ఆధారంగా నిర్మితమైన సాంకేతిక విప్లవాన్ని నానోటెక్నాలజీ అంటారు. నానో మెటీరియల్స్ ప్రదర్శించే ప్రత్యేక ధర్మాలు మానవాళి దైనందిన జీవితాలను ఎంతో ప్రభావితం చేస్తున్నాయి. ఒక సాధారణ లోహ కణపరిమాణము మైక్రో స్థాయిలో ఉన్నపుడు ఎలక్ట్రాన్లన్నీ అపరిమిత స్వేచ్ఛను కలిగి సాధారణ ధర్మాలైన రంగు, వాహకత, రైతులుగా/తీగెలుగా సాగే గుణాలను కలిగి ఉంటాయి. అదే లోహ కణపరిమాణము 100 నానోమీటర్ల కన్న తగ్గినపుడు ఎలక్ట్రాన్లు పరిమిత స్వేచ్ఛను కలిగి అసాధారణ విలక్షణ ధర్మాలకు దారి తీస్తాయి. సాధారణ స్వర్ణపు రంగు (గోల్డన్ ఎల్లో) ఉంటుందని అందరికి తెలుసు కదా.

అదే బంగారము నానో మెటీరియల్ అయితే దాని వర్ణము నలుపు, ఎరుపు, గులాబీ లేదా బ్రౌన్ ఉండుట ఆశ్చర్యాన్ని కలుగ చేస్తుంది. నానో బంగారము నీరు, కిరోసిన్, ఆమ్లంలో కరుగుట చూడవచ్చు. నానో మెటీరియల్స్ ప్రదర్శించే అసాధారణ ధర్మాల్లో విలక్షణ రంగులు, కాంతి ధర్మాలు, ఊహకందని ఇతర ధర్మాలు వస్తాయి. బంగారపు కణపరిమాణము 5-30 నానోమీటర్లకు తగ్గిస్తే దాని రంగు ఎరుపు అవుతుంది. అదే క్రమంలో కణ పరిమాణాన్ని మార్చితే రంగులు మారతాయి. నానో కణాల ఆకృతులు గోళము, కడ్డీ, తీగ, త్రికోణము మారిన వెంటనే ఆ పదార్థ ధర్మాలు మారును. సాధారణ పదార్థాలతో పోల్చితే నానో మెటీరియల్స్ భౌతిక రసాయన ధర్మాల్లో విలక్షణత ఉంటుంది.

నానో మెటీరియల్స్ తయారీ:

నానో మెటీరియల్స్ తయారు చేయటానికి రెండు పద్ధతులు ఉన్నాయి. కణపరిమాణాన్ని తగ్గిస్తూ 100 నానో మీటర్ల కన్న తగ్గించుట మె?దటి పద్ధతి. భౌతిక పద్ధతులన్నీ ఈ వర్గంలోకి వస్తాయి. పరమాణు, అణువులను కలుపుతూ నానో పరిమాణానికి తీసుకురావటం రెండవ పద్ధతి. రసాయన పద్ధతులు ఈ వర్గానికి చెందుతాయి. ఎలక్ట్రాన్ల స్వేచ్ఛాపరిమితుల ఆధారంగా నానో మెటీరియల్లను ఏకమితీయ తీగలు, ద్విమితీయ రేకులు, శూన్యమితీయ క్వాంటం డాట్లుగా వర్గీకరించవచ్చు. నానో కణ పరిమాణాన్ని వివిధ పరిమాణాల్లో నియంత్రించుట ద్వారా వివిధ ధర్మాలను మార్చుతూ మానవాళి సంక్షేమానికి నూతన దారులు తెరుచుకున్నాయి.

నానో టెక్నాలజీ అనువర్తనాలు:

వైద్యరంగంలో వ్యాధినిర్ధారణ, నిర్దిష్ట ఔషధ ప్రయోగముల, కణజాల ఉత్పత్తి మరియు రిపేర్, చికిత్సలాంటి శాఖల్లో నానోటెక్నాలజీ విభాగం ఉపయోగపడుతున్నది. రసాయనశాస్త్రంలో ఉత్ప్రేరకము, వడపోత, రసాయన సంశ్లేషణ అవగాహన, అసాధారణ ధర్మాలుగల నానోమెటీరియల్స్ తయారు, పాలిమర్ల రూపకల్పన వంటి ప్రక్రియలో ఉపయోగిస్తారు. ఉష్ణబంధక పదార్థాలను రూపొందించి విద్యుత్తును ఆదా చేయడం, అధిక కార్యదక్షతగల సోలార్ సెల్స్ తయారీ, పర్యావరణ హిత శక్తి వినియోగము, బ్యాటరీ పునఃవాడకము వంటి ఉపయోగాలున్నాయి. సమాచార ప్రసార సాధనాల్లో మెమోరీ స్టోరేజ్, నావెల్ సెమికండక్టర్ పరికరాలు, కార్బన్ నానో ట్యూబులు, క్వాంటం కంప్యూటర్ల తయారీలో నానో టెక్నాలజీ ఉపయోగపడుతుంది. ఏరోస్పేస్, రిఫైనరీలు, వాహన తయారీ, భవన నిర్మాణం వంటి రంగాల్లో ఉపయోగపడును. ఆహార పదార్థాల నాణ్యత పర్యవేక్షణ, ఫుడ్ ప్యాకింగ్, నానో కుక్కింగ్ ఆయిల్స్, నానో టీ, నానో చాకొలేట్స్, పింగాణి లేదా గాజుపై పూతలు, కంటి అద్దాలు, ముడతలు పడని దుస్తువుల తయారీ, సన్ స్క్రీన్లు, వ్యవసాయ ఉత్పత్తులకు (నిలువ, ప్యాకింగ్, ప్రాసెసింగ్, రవాణ) సంబంధించిన పలు దశల్లో నానోట్టనాలజీ వాడుట, వ్యర్థపదార్థాల తొలగింపు లాంటి అనేక రంగాల్లో నానో టెక్నాలజీ ఉపయోగిస్తారు.

పెద్దపులుల మరణాలు పెరిగినయ్.. గతేడాది 127 చనిపోయినట్టు రికార్డులున్నయ్: కేంద్రం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10:దేశంలో పెద్దపులల మరణాలు పెరుగుతున్నాయి. వృద్ధాప్యంతోపాటు వివి ధ కారణాలతో అంతకుముందు 106 పులులు చనిపోతే.. ఒక్క 2021లో 127 టైగర్స్? మృతిచెందినట్టు కేంద్ర ప్రభుత్వం ఇవ్వాల తెలిపింది. రాజ్యసభలో అనుబంధ ప్రశ్నలకు పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి భూపేందర్? యాదవ్ సమాధానాలిచ్చారు. పులి జాతి మరణానికి వృద్ధాప్యం, పులుల మధ్య గొడవలు, విద్యుదాఘాతం, వేట వంటి అనేక కారణాలు ఉన్నాయని అన్నారు. పలు రాష్ట్రాలు నివేదించిన వివరాల ప్రకారం.. 2021లో పులుల మరణాల సంఖ్య 127గా ఉంది. గత సంవత్సరం మధ్యప్రదేశ్‌లో గరిష్టంగా 42 పులులు చనిపోయాయి. ఆ తర్వాత మహారాష్ట్రలో 27, కర్నాటకలో 15, ఉత్తరప్రదేశ్‌లో 9 పులులు చనిపోయినట్టు రికార్డులున్నాయన్నారు.

అడవిలో పులుల సగటు ఆయుర్దాయం సాధారణంగా 10-12 సంవత్సరాలు ఉంటుందని, అయితే సహజ పర్యావరణ వ్యవస్థలో వృద్ధాప్యం, వ్యాధులు, అంతర్గత పోరాటాలు, విద్యుదాఘాతం, వలలు, నీళ్లలో మునిగిపోవడం, రోడ్డు, రైలు ప్రమాదాల వంటి కారణాలతో చాలామట్టుకు పులులు చనిపోతున్నాయని కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్? చెప్పారు. అయితే ..పులులతో సహా వాటి పిల్లలు కూడా ఎక్కువగా చనిపోతున్నట్టు తెలిసిందన్నారు. ఈ క్రమంలో వేటగాళ్ల బారిన పడకుండా పలు రక్షణ చర్యలు ప్రభుత్వం తీసుకుంటోందని అన్నారు.

కాపుల హక్కులపై మాట్లాడిన - జి.వి.ఎల్ నరసింహరావు

అమరావతి, ఫిబ్రవరి 10: ఆంధ్రప్రదేశ్‌లో కాపులు సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన సమాజంగా మిగిలిపోయింది,అయితేఆంధ్ర ప్రదేశ్ అభివృద్ధికి కాపులు విశేష కృషి చేశారు ..కానీ ఆంధ్రప్రదేశ్ జనాభాలో 18% ఉన్న కాపులకు అభివృద్ధి ఫలాలు అందడం లేదని రాజ్యసభలో బీజేపీ సభ్యుడు జి వి ఎల్ నరసింహారావు జీరో అవర్ లో ఈ సమస్యని లేవనెత్తారు. బ్రిటిష్ పాలనలో, కాపులను వెనుకబడిన తరగతులుగా పరిగణించారు (1915 జిఓ నెం.67 ప్రకారం) కానీ 1956లో నీలం సంజీవ రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆ జాబితా నుండి వారిని తొలగించారు. 1956 నుంచి కాపులకు రాజకీయంగా అధికారం లేదన్న కారణంగా అన్ని ప్రభుత్వాలు, కాపులకు అన్యాయం చేశాయన్నారు. విద్యాపరంగా, సామాజికంగా ఆర్థికంగా బలహీనంగా ఉన్న కాపులు రిజర్వేషన్ల కోసం ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నారు. రెండు దశాబ్దాలుగా ఆంధ్రప్రదేశ్‌లో కాపు రిజర్వేషన్ల కోసం తీవ్ర రాజకీయ ఆందోళనలు చేస్తూనే వున్నారు.

2017లో ఆంధ్రప్రదేశ్‌లోని విద్యాసంస్థలు, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో కాపులకు 5% రిజర్వేషన్లు కల్పిస్తూ ఆంధ్రప్రదేశ్ కాపు రిజర్వేషన్ బిల్లు, 2017 పేరుతో ఏపీ రాష్ట్ర అసెంబ్లీ బిల్లును ఆమోదించింది. రాష్ట్రంలో విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ల కోసం సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతులను గుర్తించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి మాత్రమే ఉన్నప్పటికీ, బిల్లు ఆమోదం కోసం కేంద్ర ప్రభుత్వానికి పంపబడింది. ఇది అనవసరం. రాష్ట్ర ప్రభుత్వం దీనిపై తనంతట తానుగా చర్య తీసుకోవచ్చు. ముస్లిం రిజర్వేషన్ బిల్లును సమ్మతి కోసం కేంద్ర ప్రభుత్వానికి పంపలేదు,అయితే జాగరణ కోసం కాపుల బిల్లును కేంద్రానికి పంపారు. ఆ బాధ్యతను కేంద్ర ప్రభుత్వంపై మోపాలన్నదే ఉద్దేశం అని ఆయన ఆరోపించారు. కాపు సామాజికవర్గానికి చెందిన ఇద్దరు రాష్ట్ర అధ్యక్షులను నియమించి కాపులపట్ల తనకున్న అభిమానం, నిబద్ధతను భారతీయ జనతా పార్టీ చాటుకొందన్నారు .ఆంధ్రప్రదేశ్ ఉద్యోగాలు, విద్యాసంస్థల్లో కాపులకు రిజర్వేషన్లు వెంటనే అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నానని ఆయన సభలో పేర్కొన్నారు. అలా చేయకపోతే రాష్ట్ర ప్రజల ఆగ్రహాన్ని చూడవలసి వస్తుందని ఈ సందర్భంగా జి వి ఎల్ నరసింహారావు రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ఇంటర్ స్టూడెన్స్ కు స్పెషల్ క్లాసులు.. ఫైనల్ ఎగ్జామ్స్‌కి సన్నద్ధం చేయాలి: ఇంటర్ బోర్డ్..

హైదరాబాద్, ఫిబ్రవరి 10:ఇంటర్ విద్యార్థులకు పరీక్షల సమయం దగ్గరపడుతున్నందున సిలబస్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఇంటర్ బోర్డు కార్యదర్శి సయ్యద్ ఉమర్ జలీల్ ఆదేశించారు. ప్రభుత్వ, ఎయిడెడ్ కాలేజీల్లో చదివే విద్యార్థుల కోసం అవసరమైతే స్పెషల్ క్లాసులు పెట్టైనా సిలబస్‌ను పరీక్షలకు ముందే మొత్తం పూర్తి చేయాలని సూచించారు. ఈమేరకు బోర్డు సెక్రటరీ బుధవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో డిస్ట్రిక్ట్ ఇంట ర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారులు, నోడల్ అధికారులకు ఆదేశించారు.

మార్చి 23 నుంచి ఏప్రిల్ 8 వరకు ప్రాక్టికల్ పరీక్షలు, ఏప్రిల్ 20 నుంచి వార్షిక పరీక్షలు జరగనున్న నేపథ్యంలో సిలబస్ బోధనపై అధికారులు దృష్టి సారించారు. ఈక్రమంలోనే ప్రభుత్వ, ఎయిడెడ్ కాలేజీల్లో త్వరగా సిలబస్‌ను పూర్తి చేయాలని సూచించారు. ముందస్తుగా నిర్ణయించిన ప్రకారం ఈసారి కూడా 70 శాతం సిలబస్‌తోనే పరీక్షలు నిర్వహించనున్నారు.

శ్రీవారి సేవలో ఏపీ గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్..

అమరావతి, ఫిబ్రవరి 10: ఏపీ గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ గురువారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.

ముందుగా ఆలయం వద్దకు చేరుకున్న గవర్నర్‌కు టిటిడి ఛైర్మన్ సుబ్బారెడ్డి, ఈవో డాక్టర్ కె.ఎస్.జవహర్ రెడ్డి, అదనపు ఈవో ధర్మారెడ్డి, సివిఎస్వో శ్రీ గోపినాథ్ జెట్టి సాదరంగా అహ్వానించగా? అర్చక బృందం "ఇస్తికఫాల్" ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.

అనంతరం ఆయన శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం మొక్కులు చెల్లించుకున్నారు. ఆ తరువాత రంగనాయకుల మండపంలో బిశ్వ భూషణ్ హరిచందన్‌కు వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఈ సందర్భంగా టిటిడి ఛైర్మన్, ఈవోలు ఆయనకు తీర్థప్రసాదాలు అందించారు.

తరచుగా జరిగే ప్రకృతి వైపరీత్యాల కోసం పాలసీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9:ప్రభుత్వం తన నిరంతర కృషితో ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనేందుకు సంసిద్ధతను గణనీయంగా మెరుగుపరుచుకుంది. విపత్తు నిర్వహణ (డిఎం) చట్టం, 2005 ప్రకారం, విపత్తు నిర్వహణపై జాతీయ విధానం (ఎన్‌పిడిఎం) జారీ చేయబడింది. సమగ్రమైన, చురుకైన, బహుళ-విపత్తుల ఆధారితమైన మరియు అభివృద్ధి చేయడం ద్వారా సురక్షితమైన మరియు విపత్తులను తట్టుకునే భారతదేశాన్ని నిర్మించాలనే లక్ష్యంతో నివారణ, తగ్గించడం, సంసిద్ధత మరియు ప్రతిస్పందన ద్వారా సాంకేతికత ఆధారిత వ్యూహంతో ముందుకు వెళ్తుంది. మొదటి జాతీయ విపత్తు నిర్వహణ ప్రణాళికను నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ (ఎన్‌డిఎంఎ) 2016లో జారీ చేసింది మరియు ఇది 2019లో సమీక్ష తర్వాత సవరించబడింది. వారి సంబంధిత ప్రణాళికలు మరియు ప్రాజెక్ట్‌లలో సంసిద్ధత, ఉపశమన చర్యలు మరియు సామర్థ్య నిర్మాణ కార్యక్రమాలను ఏకీకృతం చేయడానికి ఎన్‌డిఎంఎ కూడా భారత ప్రభుత్వంతో పాటు రాష్ట్రంలోని వివిధ మంత్రిత్వ శాఖలు/విభాగాలు అనుసరించాల్సిన మార్గదర్శకాలను జారీ చేసింది. ఎన్‌డిఎంఎ ప్రారంభం నుండి వరదలతో సహా వివిధ నేపథ్య మరియు క్రాస్-కటింగ్ సమస్యలపై ప్రమాదకర నిర్దిష్ట విపత్తు నిర్వహణ కోసం వివిధ మార్గదర్శకాలను జారీ చేసింది.

ఏదైనా విపత్తు లేదా విపత్తు పరిస్థితిలో నిపుణుల ప్రతిస్పందనను అందించడానికి భారత ప్రభుత్వం నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎన్‌డిఆర్‌ఎఫ్)ని ఏర్పాటు చేసింది. ఇంకా, భారత ప్రభుత్వం ఎన్‌డిఆర్‌ఎఫ్ సిబ్బందికి మరియు ఇతర వాటాదారులకు శిక్షణనిచ్చేందుకు నాగ్‌పూర్‌లో ప్రీమియం ఇన్‌స్టిట్యూట్‌ని అంటే ఎన్‌డిఆర్‌ఎఫ్ అకాడమీని కూడా ఏర్పాటు చేసింది. ఇంకా, రెస్క్యూ ఆపరేషన్స్‌లో నిమగ్నమైన సిబ్బందికి శిక్షణ ఇవ్వడం నిరంతర ప్రక్రియ. అటువంటి సిబ్బందికి కెపాసిటీ బిల్డింగ్ మరియు కార్యాచరణ సంసిద్ధత కోసం శిక్షణ ఇవ్వబడుతుంది. కెమికల్, బయోలాజికల్, రేడియోలాజికల్ మరియు న్యూక్లియర్ (సిబిఆర్‌ఎన్) అత్యవసర పరిస్థితులతో సహా సహజ మరియు మానవ నిర్మితమైన అన్ని రకాల విపత్తులకు సమర్థవంతంగా ప్రతిస్పందించడానికి ఎన్‌డిఆర్‌ఎఫ్ సిబ్బందికి వారి నైపుణ్యాలను అప్‌గ్రేడ్ చేయడం కోసం క్రమం తప్పకుండా శిక్షణ ఇస్తారు. ఎన్‌డిఆర్‌ఎఫ్ సిబ్బంది వివిధ అంతర్జాతీయ ఈవెంట్‌లలో పాల్గొనడానికి కూడా నామినేట్ చేయబడతారు. అంటే శిక్షణా కోర్సులు/సెమినార్లు/వర్క్‌షాప్‌లు మొదలైన వాటిలో విపత్తు నిర్వహణలో అత్యుత్తమ అభ్యాసాలు, ప్రపంచవ్యాప్తంగా అవలంబిస్తున్న అధునాతన పరికరాలు ఉ సాంకేతికతలపై వారి నైపుణ్యాలను నవీకరించడానికి ఉద్దేశించబడింది. ఎన్‌డిఆర్‌ఎఫ్ రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం (ఎస్‌డిఆర్‌ఎఫ్), రాష్ట్ర పోలీస్, హోంగార్డ్స్, సివిల్ డిఫెన్స్, ఫైర్ సర్వీసెస్, నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్‌సిసి), ప్రభుత్వేతర సంస్థల "కమ్యూనిటీ కెపాసిటీ బిల్డింగ్ మరియు పబ్లిక్ అవగాహన మరియు సంసిద్ధత కార్యక్రమం"లో అవిశ్రాంతంగా నిమగ్నమై ఉంది. వీటిలో ఎన్‌జిఓలు, నెహ్రూ యువ కేంద్ర సంగటన్(ఎన్‌వైకేఎస్), విద్యార్థులు, వాలంటీర్లు మరియు ఇతర వాటాదారులు వీటిలో ఉన్నారు.వరదలు, కొండచరియలు విరిగిపడటం, భూకంపాలు, రసాయన (పారిశ్రామిక) వైపరీత్యాలు మొదలైన వివిధ విపత్తుల కోసం రెస్క్యూ ఆపరేషన్లలో నిమగ్నమైన ఇతర సంస్థలు/అధికారుల సహకారంతో క్రమమైన వ్యవధిలో మాక్ ఎక్సర్సైజ్‌లు/టేబుల్ టాప్ వ్యాయామాలు కూడా ఎన్‌డిఎంఎ మరియు ఎన్‌డిఆర్‌ఎఫ్ నిర్వహిస్తున్నాయి.ఈ విషయాన్ని హోం వ్యవహారాల సహాయ మంత్రి శ్రీ నిత్యానంద రాయ్ ఈరోజు రాజ్యసభలో ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు.

సామర్థ్య పెంపుదలకు మరిన్ని సంస్కరణలు అమలు చేయాలని డీజీడీఈ కు సూచించిన శ్రీ రాజనాథ్ సింగ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9:ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి 17.78 లక్షల ఎకరాల రక్షణ భూమిని విజయవంతంగా సర్వే చేసిన రక్షణ శాఖ ఎస్టేట్స్ శాఖ సిబ్బందిని రక్షణ శాఖ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ అభినందించి అవార్డులు అందజేశారు. 2022 ఫిబ్రవరి 10న జరిగిన కార్యక్రమంలో 38 డిఫెన్స్ ఎస్టేట్ కార్యాలయానికి చెందిన 11 మంది అధికారులు, 24 మంది సిబ్బంది, నలుగురు అసిస్టెంట్ డిఫెన్స్ ఎస్టేట్ అధికారులకు శ్రీ రాజ్‌నాథ్ సింగ్ అవార్డులను అందించారు.

రక్షణ శాఖ ఎస్టేట్ కార్యాలయం నిర్వహిస్తున్న రికార్డుల ప్రకారం రక్షణ మంత్రిత్వ శాఖ దాదాపు 17.99 లక్షల ఎకరాల భూమి ఉంది. అందులో 1.61 లక్షల ఎకరాల భూమి దేశవ్యాప్తంగా 62 నోటిఫైడ్ కంటోన్మెంట్ ప్రాంతాలలో ఉంది. దాదాపు 16.38 లక్షల ఎకరాల భూమి కంటోన్మెంట్ వెలుపల అనేక ప్రాంతాల్లో విస్తరించి ఉంది. 16.38 లక్షల ఎకరాల భూమిలో దాదాపు 18,000 ఎకరాల భూమిని రాష్ట్రాలకు అద్దెకు ఇవ్వడం లేదా ఇతర ప్రభుత్వ శాఖలకు బదిలీ చేయడం జరిగింది. ఇతర ప్రభుత్వ శాఖలకు బదిలీ చేసిన భూముల వివరాలను రికార్డుల నుంచి తొలగించాలన్న ప్రతిపాదన పరిశీలనలో ఉంది. స్వాతంత్ర్యం తర్వాత మొదటిసారిగా మొత్తం రక్షణ భూమిని వివిధ రాష్ట్ర ప్రభుత్వాల రెవెన్యూ అధికారుల సహకారంతో ఆధునిక పద్ధతులను ఉపయోగించి సర్వే చేయడం జరిగింది. ఇది రక్షణ శాఖ సాధించిన విజయాల్లో ఒకటిగా నిలుస్తుంది.

కోవిడ్ -19 మహమ్మారి ముప్పు మధ్య, జనావాసాలు లేని మారుమూల ప్రదేశాలలో ప్రతికూల వాతావరణ పరిస్థితులలో కార్యక్రమాన్ని విజయవంతంగా ముగించిన డిఫెన్స్ ఎస్టేట్ సిబ్బందిని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ అభినందించారు. ఈ సర్వేను చారిత్రాత్మక సర్వేగా ఆయన వర్ణించారు. ఈ ప్రాంతాల భద్రత మరియు అభివృద్ధిలో రక్షణ భూముల స్పష్టమైన సరిహద్దులు కీలక పాత్ర పోషిస్తాయని మంత్రి పేర్కొన్నారు. సర్వేతో భూముల కొలతలు, విస్తీర్ణం ఖచ్చితంగా తెలుస్తాయని మంత్రి పేర్కొన్నారు. విశ్వసనీయమైన రికార్డులు భూవివాదాల పరిష్కారానికి అవుతున్న ఖర్చు, వనరులు శక్తి, సమయాన్ని గణనీయంగా ఆదా చేస్తాయని ఆయన తెలిపారు.

డ్రోన్ చిత్రాలు, ఉపగ్రహ చిత్రాలు 3డి పరిజ్ఞానం ఉపయోగించి తొలిసారిగా సర్వేలో ఉపయోగించిన డైరెక్టరేట్ జనరల్ డిఫెన్స్ ఎస్టేట్స్ (డిజిడిఇ)ని రక్షణ మంత్రి అభినందించారు. ఆధునిక పరిజ్ఞానం ఉపయోగించి నిర్వహించిన సర్వే ఫలితాలు ఖచ్చితంగా, విశ్వసనీయంగా ఉంటాయని అన్నారు. సర్వేలో ఎలక్ట్రానిక్ టోటల్ స్టేషన్ మరియు డిఫరెన్షియల్ గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్ వంటి ఆధునిక సర్వే పద్ధతులు ఉపయోగించారు. ఖచ్చితమైన మరియు సమయానుకూల ఫలితాలను పొందడానికి డ్రోన్ మరియు ఉపగ్రహ చిత్రాల ఆధారిత సర్వేలు కూడా నిర్వహించబడ్డాయి.

సర్వే మరియు భూ రికార్డుల ప్రాముఖ్యతను శ్రీ రాజ్‌నాథ్ సింగ్ వివరించారు. ప్రాంతం, రాష్ట్రం లేదా దేశంలో అభివృద్ధికి ఇది పునాదిగా ఉంటాయని వివరించారు. "గత 200-300 సంవత్సరాల కాలంలో ప్రపంచవ్యాప్తంగా కొంతమంది తమ ఆధిపత్యాన్ని సంపాదించే అంశంలో సర్వే పరిజ్ఞానం ముఖ్యమైన పాత్ర పోషించింది. నేడు మన దేశం భూ సర్వే రంగంలో ముందుకు సాగుతోంది. రక్షణ భూములు, కంటోన్మెంట్ ప్రాంతాలకు ఆధునిక పద్ధతులతో రక్షణ కల్పించే అంశంలో సర్వే కీలకంగా ఉంటుంది' అని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ అన్నారు.

దేశ సామాజిక-ఆర్థిక మరియు సాంస్కృతిక అభివృద్ధిలో కంటోన్మెంట్ ప్రాంతాలు ముఖ్యమైన పాత్రను పోషించాయని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. " కేంద్ర ప్రభుత్వం తన బడ్జెట్‌లో రక్షణ భూమిలో సరిహద్దుల నిర్మాణానికి 173 కోట్ల రూపాయలు కేటాయించింది. ఇది కేవలం ఆర్థిక మంజూరు మాత్రమే కాదు. కంటోన్మెంట్ ప్రాంతాలను రక్షించి, అభివృద్ధి చేయడానికి మా నిబద్ధతను సూచిస్తుంది. ఈ నేపథ్యంలో ఈ సర్వే అత్యంత కీలకమైంది' అని ఆయన తెలిపారు.

దైనందిన జీవితంలో సాంకేతికతను అంతర్భాగంగా మారిందని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. రక్షణ మంత్రిత్వ శాఖ ఈ దిశలో ముందడుగు వేయడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.

దీనిలో భాగంగా ఈ-ఛవానీ పోర్టల్ ఏర్పాటు అయ్యిందని వివరించారు. కంటోన్మెంట్ బోర్డుల పరిధిలో నివసిస్తున్న వారికి సౌలభ్యంను అందించాలన్న లక్ష్యంతో ఫిబ్రవరి 2021లో రక్షణ మంత్రిత్వ శాఖ ఈ-ఛవానీ పోర్టల్ ను ప్రారంభించింది. పోర్టల్ (https://echhawani.gov.in/) దేశవ్యాప్తంగా విస్తరించి ఉన్న 62 కంటోన్మెంట్ బోర్డులలోని 20 లక్షల మంది నివాసితులకు ఆన్‌లైన్ పౌర సేవలను అందిస్తుంది. దీనికి రూపకల్పన చేసిన డిజిడిఇ ని అధినందించిన మంత్రి ప్రారంభించినప్పటి నుంచి సేవలు అందించేందుకు తీసుకుంటున్న సమయం, కాగితం వాడకం 50-80 శాతం తగ్గిందని ఆయన అన్నారు.

2020 ఆగస్టులో 'ఆత్మనిర్భర్ వారోత్సవాల సందర్భంగా ప్రారంభించిన 'సృజన్ పోర్టల్' ను మంత్రి ప్రస్తావించారు. 'వన్ స్టాప్ షాప్' గా పనిచేసే ఈ పోర్టల్ స్వదేశంలో తయారయ్యే ఉత్పత్తులను అమ్మకందారులకు చెరువలోకి తీసుకుని వెళ్తాయని అన్నారు. క్యాంటీన్ స్టోర్ డిపార్ట్‌మెంట్ ఆన్‌లైన్ పోర్టల్, ఇ-సెహత్ పోర్టల్, రక్షణ శాఖ పెన్షన్ పోర్టల్, ఎన్‌సిసి శిక్షణ మరియు గ్యాలంట్రీ అవార్డుల పోర్టల్ వంటి కార్యక్రమాలను అమలు చేస్తూ రక్షణ మంత్రిత్వ శాఖ జీవన సౌలభ్యాన్ని ప్రోత్సహిస్తున్నదని అన్నారు. దీనిద్వారా మరియు మా సాయుధ దళాల సిబ్బంది మరియు అనుభవజ్ఞుల శ్రేయస్సుకు కృషి చేస్తున్నామని ఆయన వివరించారు.

'డిజిటల్ ఇండియా' కార్యక్రమం కింద డిజిటలైజేషన్‌ను ప్రోత్సహించి ప్రజల జీవితాలను సులభతరం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ పునరుద్ఘాటించారు. వాతావరణ శాఖ గతంలో కంటే మరింత కచ్చితత్వంతో ముందస్తుగా వాతావరణాన్ని అంచనా వేయడానికి అంతరిక్ష సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడాన్ని ఆయన పెద్ద ముందడుగుగా అభివర్ణించారు. ఇది సాయుధ బలగాలు మరియు విపత్తు సహాయక బృందాలకు సహాయక చర్యలకు తగిన సమయాన్ని అందిస్తుందని అన్నారు. "వ్యవసాయం, విద్య మరియు ఆరోగ్య రంగాల్లో సాంకేతికతను ఉపయోగించడం మన దేశ పురోగతిని ప్రతిబింబిస్తుంది. 2022-23 కేంద్ర బడ్జెట్ లో డిజిటల్ కరెన్సీ మరియు డిజిటల్ యూనివర్సిటీ ప్రకటనలు సాంకేతికత రంగంలో దేశ వ్యవస్థలను ప్రపంచ స్థాయికి తీసుకురావాలనే ప్రభుత్వ సంకల్పానికి నిదర్శనం "అని ఆయన అన్నారు. ఇతర మంత్రిత్వ శాఖలు మరియు విభాగాలు డిజిడిఇ నుంచి స్ఫూర్తి పొంది సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడాన్ని ప్రోత్సహించాలని ఆయన సూచించారు. ఇది దేశ నిర్మాణంలో కీలకంగా ఉంటుందని అన్నారు.

సాయుధ బలగాల సిబ్బంది సంక్షేమం మరియు సౌలభ్యం కోసం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని శ్రీ రాజనాథ్ సింగ్ స్పష్టం చేశారు. పనుల్లో మరింత పారదర్శకత, జవాబుదారీతనం మరియు సమయపాలన కోసం మరిన్ని రంగాలలో సంస్కరణలు తీసుకురావాలని డిజిడిఇ ని మంత్రి కోరారు, వ్యవస్థ మరింత ప్రభావవంతంగా పనిచేసేందుకు సంస్కరణలు ఉపయోగపడతాయని అన్నారు. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు మంత్రిత్వ శాఖ నుంచి అన్ని విధాల సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

రక్షణ భూముల నిర్వహణ మరియు సుమారు రెండు మిలియన్ల జనాభా కలిగిన 62 కంటోన్మెంట్ మునిసిప

భవిష్యత్ ఇంధనం గ్రీన్ హైడ్రోజన్.. ప్రపంచదేశాలకు ఎగుమతే లక్ష్యం : నితిన్ గడ్కరీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: భవిష్యత్ ఇంధనం గ్రీన్ హైడ్రోజన్ అని, దాన్ని ప్రపంచదేశాలకు ఎగుమతి చేయడమే లక్ష్యమని కేంద్ర రోడ్లు, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. గురువారం ఆయన ఓ మీడియా సంస్థకు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హర్యానాలో మార్చి 15న టయోటా కారును ఇండియన్ ఆయిల్ ఫరీదాబాద్ ల్యాబ్ గ్రీన్ హైడ్రోజన్ ఇంధనంతో టెస్ట్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ప్రస్తుతం తాము గ్రీన్ హైడ్రోజన్ వైపు వెళ్తున్నామని.. తన ఆలోచన మురుగు, టాయిలెట్ వాటర్ నుంచి తయారు చేయడమన్నారు. తక్కువ ఖర్చుతో సౌర, పవన శక్తిని వినియోగించుకోవచ్చన్నారు. ప్రస్తుతం 8లక్షల కోట్ల ముడి చమురు, గ్యాస్, పెట్రోలియం ఉత్పత్తులు దిగుమతి చేస్తున్నామన్న ఆయన.. వాటికి ప్రత్యామ్నాయ ఇంధనాలైన ఇథనాల్, మిథనాల్, బయో డీజిల్, సీఎన్‌జీ (కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్), ఎలక్ట్రిక్, బయో ఎల్ఎన్‌జీ, గ్రీన్ హైడ్రోజన్‌తో భర్తీ చేయాలనుకుంటున్నట్లు చెప్పారు. ముంబై, పూణే, ఢిల్లీ వంటి నగరాలు ఎలక్ట్రిక్ బస్సులను ఎంపిక చేసుకోవడంతో వాటి సంఖ్య పెరిగిందని అభిప్రాయపడ్డారు. రెండేళ్లలో ఎలక్ట్రిక్ 2, 3, 4 వీలర్ వాహనాలు, బస్సుల ధర సైతం పెట్రోల్, డీజిల్ వాహనాల ధరలతో సమానంగా ఉంటుందని పేర్కొన్నారు.

భారత్ లిథియం-అయాన్ బ్యాటరీలను తయారు చేయడమే కాకుండా.. జింక్-అయాన్, సోడియం-అయాన్, అల్యుమినియం-అయాన్ బ్యాటరీలను సైతం అభివృద్ధి చేస్తుందన్నారు. భారతీయ స్టార్టప్ కంపెనీలు ఈ విషయంలో చాలా పరిశోధనలు చేస్తున్నాయని వివరించారు. ఐదేళ్లలో ప్రపంచంలోనే ఆటోమొబైల్స్ తయారీలో భారత్ నంబర్ వన్‌గా నిలుస్తుందని చెప్పారు. ఈ రంగంలో టర్నోవర్ రూ. 7.5లక్షల కోట్ల నుంచి రూ.15లక్షల కోట్లకు పెరుగుతుందని వివరించారు.

అపహరణకు గురైన పసిబాలున్ని 7 గంటల్లో కనిపెట్టిన ప్రకాశం పోలీసులు

అమరావతి, ఫిబ్రవరి 10:ప్రకాశం జిల్లా ఎస్పీ మలిక గర్గ్ ఆదేశాల మేరకు కందుకూరు డిఎస్పీ కె.శ్రీనివాసరావు ఉత్తర్వుల ప్రకారం సిఐ కనిగిరి బి.పాపారావు పర్యవేక్షణలో కనిగిరి, వెలిగండ్ల, పీసీ పల్లి ఎస్సైలు 7 గంటల వ్యవధిలో అపహరణకు గురైన బాలుడి ఆచూకీ కనిపెట్టారు. జయంపు దుర్గా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు కిడ్నాప్ నకు గురైన జయంపు వంశి కుమార్ (9 నెలలు) గుర్తించారు. జయంపు సుధ, చేవూరి ప్రేమలత, దొంతుబోయిన గోపిరెడ్డి బాలున్ని అపహరించుకు పోయారు. ఈనెల 9వ తేదీ తేది మధ్యాహ్నం సుమారు 3.30 గంటల సమయంలో కనిగిరి పట్టణంలోని కాశిరెడ్డి కాలనీలోని జయంబు దుర్గా రెండవ కుమారుడు అయిన జయంబు వంశి కుమార్ అను 9 నెలల బాలుడిని కిడ్నాప్ చేసి తీసుకొని పోయినట్లుగా, సాయంత్రం సుమారు 6.30 గంటల సమయంలో కనిగిరి పోలీస్ స్టేషన్ లో రిపోర్టు రాగా, సదరు రిపోర్టుపై కేసు నమోదు చేశారు. అంతట ప్రకాశం జిల్లా మలిక గర్గ్ ఆదేశాల మేరకు ఆమె ఎప్పటికప్పుడు ఇస్తున్న సూచనల మేరకు కందుకూరు డీఎస్పీ కందే శ్రీనివాసులు పర్యవేక్షణలో కనిగిరి సీఐ, కనిగిరి ఎస్ఐ, వెలిగండ్ల ఎస్ఐ, పీసీ పల్లి ఎస్ఐని వారి సిబ్బందితో పాటు బృందాలుగా ఏర్పరిచి, ప్రకాశం జిల్లాలోని ఐటీ కోర్ టీం వారి సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో బాలుని ఆచూకీ నిమిత్తం వెతుకుచుండగా గుంటూరు జిల్లా అమరావతి దగ్గరలో గల నెమలికల్లు గ్రామంలో బాలుని ఆచూకి తెలుసుకొని బాలున్ని రాత్రి కొన్ని గంటల సమయంలో చేధించి, బాలుడిని స్వాధీన పరుచుకోవడమైనది.

ఈ నేరంలో కనిగిరి టౌన్ లోని కాశిరెడ్డి కాలనీ నందు నివాసముంటున్న జయంపు సుధ అను ఆమెకు 5 మంది పిల్లలు అయినట్లు, ఫ్యామిలీతో దూరంగా గుంటూరుకు చెందిన గోపిరెడ్డితో సుమారు 3 సంవత్సరాల నుండి కలిసి ఉంటున్నట్లు, వీరిద్దరికీ పిల్లలు లేనందున కనిగిరి టౌన్ లోని కాశిరెడ్డి కాలనీకి చెందిన చేవూరి ప్రేమలతతో కలిసి ముగ్గురు ప్లాన్ చేసుకొని 9వ తేదీన వంశి కుమార్ ను కిడ్నాప్ చేసి పెంచుకోవడానికి తీసుకొని వెళ్ళినారు. బాలుడు క్షేమంగానే వున్నాడు. బాలుని కిడ్నాప్ నకు సంబంధించిన జయంపు సుధ, చేవూరి ప్రేమలత, దొంతిబోయిన గోపిరెడ్డి, అను వారిని అరెస్టు చేసి రిమాండ్ కు పంపించారు. ముద్దాయిలను గుర్తించి అరెస్టు చేసిన కందుకూరు డిఎస్పి కె.శ్రీనివాసరావు, కనిగిరి సిఐ పాపారావు, కనిగిరి ఎస్సై జి.రామిరెడ్డి, పి.సి.పల్లి ఎస్సై ప్రేమే కుమార్, వెలిగండ్ల ఎస్సై రాజ్ కుమార్, సిబ్బందిని ప్రకాశం జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

గ్రీన్ ఇండియా ఛాలెంజ్ స్వీకరించిన శాసనసభాపతి పోచారం

హైదరాబాద్, ఫిబ్రవరి 10:తన పుట్టినరోజు సందర్భంగా గ్రీన్ ఇండియా ఛాలెంజ్ పిలుపు మేరకు బాన్సువాడ మండలం బోర్లం గ్రామంలో తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి పోచారం శ్రీనివాస రెడ్డి మొక్కలు నాటారు. ప్రకృతి, సమాజ హితం కోసం రాజ్యసభ సభ్యులు సంతోష్ కుమార్ ఈ గ్రీన్ ఇండియా ఛాలెంజ్ కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. ఈ యజ్ఞంలో ప్రజలు ఉద్యమంలా పాల్గొనాలన్నారు. చిన్నవారైనా పెద్దవారైనా అందరూ తమ జన్మదినం సందర్భంగా మొక్కలను నాటి కాపాడుకోవాలన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ఉపరాష్ట్రపతి

తిరుమల, ఫిబ్రవరి 10:: తిరుమల తిరుపతి శ్రీవారిని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఈ రోజు ఉదయం వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. మహాద్వారం వద్ద ఆయనకు టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈవో జవహర్ స్వాగతం పలికారు. ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వెంకయ్య నాయుడికి వేదాశీర్వచనం ఇచ్చారు. ఆలయ ఈవో స్వామివారి తీర్థ ప్రసాదాలను వెంకయ్య నాయుడికి అందజేశారు. స్వామివారి దర్శనం అనంతరం వెంకయ్య నాయుడు మీడియాతో మాట్లాడుతూ.. శ్రీవారి దర్శనంతో లభించిన సంతృప్తితో ప్రజలకు మరింత సేవ చేసే భాగ్యం లభిస్తుందని అన్నారు. హిందూ ధర్మాన్ని పరిరక్షించుకుంటూ దేశ సాంప్రదాయాలను కొనసాగిస్తూ, ప్రపంచానికి అందించాల్సిన బాధ్యత మన అందరిపైనా ఉందన్నారు.

శ్రీవారి దర్శన భాగ్యం అందరికీ ఏ ఇబ్బందులు లేకుండా దక్కాలని అన్నారు. ఇందుకోసం ప్రజాప్రతినిధులు, ప్రముఖులు ఏడాదికి ఒకసారి మాత్రమే స్వామి వారిని దర్శించుకోవాలని చెప్పారు. ఈ విధానాన్ని తాను కూడా పాటిస్తున్నట్లు వెంకయ్య నాయుడు తెలిపారు. తాను తన మనవరాలు సుష్మ వివాహానికి హాజరవ్వడానికి తిరుమల వచ్చానని వివరించారు. పుష్పగిరి మఠంలో నిరాడంబరంగానే వివాహం చేస్తున్నట్లు చెప్పారు.

కాగా, వెంకయ్య నాయుడి కుమార్తె దీపా వెంకట్ కూతురు సుష్మ పెళ్లి కిషన్ అనే అబ్బాయితో జరగనుంది. శ్రీవారిని దర్శించుకున్న అనంతరం పుష్పగిరి మఠం వద్దకు వెంకయ్య నాయుడు వెళ్లారు. ఈ వివాహ వేడుకకు ఏపీ గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తదితరులు హాజరవుతారు.

వంట నూనెలు మరియు నూనెగింజల స్టాక్ పరిమితి ఆర్డర్‌ను అమలు చేయడానికి రాష్ట్రాలు/యుటిలతో కేంద్రం సమావేశం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10:దేశంలో వంటనూనెల ధరలను తగ్గించేందుకు ప్రభుత్వం చేపట్టిన వివిధ చర్యలకు ఊతమిచ్చే ఉద్దేశ్యంతో 2022 జూన్ 30 వరకు ఎడిబుల్ ఆయిల్స్ మరియు నూనెగింజలపై స్టాక్ పరిమితి పరిమాణాలను పేర్కొంటూ ప్రభుత్వం 3 ఫిబ్రవరి, 2022న ఉత్తర్వులు జారీ చేసింది. .

స్టాక్ లిమిట్ ఆర్డర్ కేంద్ర ప్రభుత్వం మరియు అన్ని రాష్ట్రాలు/యూటీలు వంట నూనెలు మరియు నూనె గింజల నిల్వ మరియు పంపిణీని నియంత్రించడానికి అధికారం ఇస్తుంది. దేశంలోని ఆహార నూనెలు మరియు నూనె గింజల నిల్వలను తనిఖీ చేయడంలో ఇది ప్రభుత్వానికి సహాయపడుతుంది. ఫిబ్రవరి 3, 2022 నాటి ఆర్డర్ అమలు ప్రణాళిక గురించి చర్చించడం కోసం 08.02.2022న ఆహార ప్రజా పంపిణీ శాఖ అన్ని రాష్ట్రాలు/యుటిలతో సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో రాష్ట్రాలు/యుటిల అధికారులు స్టాక్‌ను అమలు చేయవచ్చని నొక్కి చెప్పబడింది. సరఫరా గొలుసులో ఎటువంటి అంతరాయాన్ని కలిగించకుండా మరియు బోనాఫైడ్ ట్రేడ్‌కు ఎటువంటి అనవసరమైన ఇబ్బందులు లేకుండా పరిమాణాల ఆర్డర్‌ను పరిమితం చేయాలని తెలిపింది.

వంట నూనెల నిల్వ పరిమితి రిటైలర్లకు 30 క్వింటాళ్లు, టోకు వ్యాపారులకు 500 క్వింటాళ్లు, బల్క్ వినియోగదారుల రిటైల్ అవుట్‌లెట్‌లకు 30 క్వింటాళ్లు అంటే పెద్ద చైన్ రిటైలర్లు మరియు షాపుల కోసం పేర్కొన్న స్టాక్ పరిమితి మరియు దాని డిపోలకు 1000 క్వింటాళ్లు. వంట నూనెల ప్రాసెసర్‌లు వాటి నిల్వ సామర్థ్యాలలో 90 రోజులు నిల్వ చేయగలవు.

వంట నూనెగింజలకు నిల్వ పరిమితి రిటైలర్లకు 100 క్వింటాళ్లు, టోకు వ్యాపారులకు 2000 క్వింటాళ్లు. రోజువారీ ఇన్‌పుట్ ఉత్పత్తి సామర్థ్యం ప్రకారం వంట నూనెగింజల ప్రాసెసర్‌లు 90 రోజుల వంటనూనెల ఉత్పత్తిని నిల్వ చేయగలవు. ఎగుమతిదారులు మరియు దిగుమతిదారులు కొన్ని ఆదేశాలతో ఈ ఆర్డర్ పరిధికి వెలుపల ఉంచబడ్డారు.

సంబంధిత చట్టపరమైన సంస్థల వద్ద ఉన్న నిల్వలు నిర్దేశిత పరిమితుల కంటే ఎక్కువగా ఉన్నట్లయితే దానిని ఆహార శాఖ పోర్టల్ (ష్టబిబిజూబ://వలవణనీతిశ్రీబ.నితిఇ.తిని/వనీబజూ/శ్రీనీణతిని)లో తెలపాలని సమావేశంలో తెలియజేయబడింది. పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ మరియు ఈ నోటిఫికేషన్ జారీ చేసిన 30 రోజులలోపు ఈ నియంత్రణ ఆర్డర్‌లో నిర్దేశించిన స్టాక్ పరిమితులకు తీసుకురావాలి. సంస్థలు వెల్లడించిన స్టాక్‌లను పర్యవేక్షించడానికి రాష్ట్రాలు/యుటిలు కూడా ఈ పోర్టల్‌కు యాక్సెస్‌ను అందించారు.

ఇంకా రాష్ట్రాలు పోర్టల్ ద్వారా స్టాక్ పరిమితులను క్రమం తప్పకుండా పర్యవేక్షించవచ్చని రాష్ట్రాలు/యుటిలకు సూచించబడింది.

పైన పేర్కొన్న చర్య మార్కెట్‌లో హోర్డింగ్, బ్లాక్ మార్కెటింగ్ మొదలైన అక్రమ పద్ధతులను అరికట్టగలదని అంచనా వేయబడింది. ఎందుకంటే అది ఎడిబుల్ ఆయిల్స్ ధరలలో ఏదైనా పెరుగుదలకు దారితీయవచ్చు. ప్రస్తుత అంతర్జాతీయ ధరల దృష్టాంతం మరియు భారతీయ మార్కెట్‌పై దాని ప్రభావం ఎలా ఉందో కూడా రాష్ట్రాలు/యూటీలకు వివరించడం జరిగింది.

ముంబైలో పశ్చిమ నావికాదళ కమాండ్‌కు నావల్ ఇన్వెస్టిట్యూర్ సెర్మనీ-2022

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10:పశ్చిమ నావికాదళ కమాండ్ (డబ్ల్యుఎన్‌సి)కు నావల్ ఇన్వెస్టిట్యూర్ సెర్మనీ-2022ను 08 ఫిబ్రవరి 22న ముంబైలో జరిగింది.

స్వాతంత్ర్య దినోత్సవం 2020, గణతంత్ర దినోత్సవం 2021న ప్రకటించిన విశిష్ట సేవా పతకాలను, సౌర్య పతకాలను పశ్చిమ నావికాదళ కమాండ్ పివిఎస్ ఎం, ఎవిఎస్ ఎం, వివిఎస్ఎం, ఎడిసి, ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్- చీఫ్ వైస్ అడ్మిరల్ అజేంద్ర బహదూర్ సింగ్ అవార్డుగ్రహీతలకు ప్రదానం చేశారు.

వేడుకలో కమాండర్ ధనుష్ మీనన్, హరిదాస్ కుందు ఎంసిఎ (ఎఫ్‌డి) ఎఎ లకు నావు సేనా మెడల్ (శౌర్యం)ను ప్రదానం చేయగా, కమాడోర్ అనిల్ మార్యకు నావు సేనా మెడల్ (విధ పట్ల తత్పరత), ఆర్ డిఎం సందీప్ మెహతా, సర్జ్ ఆర్ఎడిఎం ఆర్తి సరీన్, కమాండొర్ శ్రీకాంత కేస్నూర్, కెప్టెన్ బీరేంద్ర సింగ్ బెయిన్స్, కెప్టెన్ సుమిత్ సింగ్ సోధి, కెప్టెన్ కపిల్ భాటియా, జయ్‌సింగ్, ఎంసిపిఒ 1 (జిడబ్ల్యు)గౌరవనీయ సబ్ లెఫ్టినెంట్‌కు విశిష్ట సేవా పతకాన్ని (విఎస్ఎం) ప్రదానం చేశారు.

గత కొన్ని ఏళ్ళుగా అసాధారణ పనితీరును ప్రదర్శించిన ఐఎన్ఎస్ గోమతి, బేస్ విక్నువల్లింగ్ యార్డ్ (ముంబై)లకు యూనిట్ సైటేషన్‌లను కమాండర్-ఇన్-చీఫ్ అందించారు.

విధులను నిర్వర్తించడంలో సిబ్బందికి అపరిమితమైన మద్దతును అందించిన అవార్డుగ్రహీతల కుటుంబ సభ్యులు చేసిన తోడ్పాటును అడ్మిరల్ గుర్తించారు.

కోవిడ్-19 మహమ్మారి పరిస్థితుల కారణంగా అందరు అవార్డుగ్రహీతలకూ కలిపి నిర్వహించవలసిన ఈ ఉత్సవ వేడుకను కమాండ్ పరిధిలో నిర్వహించారు. ఈ ఉత్సవాన్ని భారతీయ నావికాదళానికి చెందిన అనేకమంది సీనియర్ అధికారులు,, ప్రముఖులు, అవార్డు గ్రహీతల భాగస్వాములు, కుటుంబాలు వీక్షించాయి

నదుల పునరుజ్జీవంలో యువతకు మరింత భాగస్వామ్యం!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10:'నమామి గంగే' పేరిట చేపట్టిన నదుల పునరుజ్జీవం ప్రక్రియలో యువజనుల భాగస్వామ్యాన్ని మరింతగా పెంచే లక్ష్యంతో కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ 3వ విడత వెబ్ సిరీస్ కార్యక్రమాన్ని నిర్వహించింది. 'యువత మనసుల ఉద్దీపన, నదుల పునరుజ్జీవం' పేరిట ఈ వెబ్ సిరీస్ కార్యక్రమాల పరంపరను ఎ.పి.ఎ.సి. న్యూస్ నెట్వర్ సంస్థతో కలసి కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ నిర్వహిస్తూ వస్తోంది. నాలుగు గంటలపాటు జరిగిన వెబ్ సిరీస్ తాజా కార్యక్రమంలో దేశవ్యాప్తంగా ఉన్న పలువురు ప్రముఖ నిపుణులు, శిక్షకులు పాల్గొన్నారు.

కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జాతీయ స్వచ్ఛ గంగా పథకం (ఎన్.ఎం.సి.జి.) డైరెక్టర్ జనరల్ జి. అశోక్ కుమార్ మాట్లాడుతూ, నీటి సంరక్షణ, నదుల పునరుజ్జీవం ప్రాధాన్యం అన్న భావనలను యువజనుల హృదయాల్లో రగిల్చడం ఇపుడు అత్యంత ఆవశ్యకమని అన్నారు. నీటికీ, యువతకూ మధ్య ఎంతో సాదృశ్యం, సంబంధం ఉందని ఆయన పేర్కొన్నారు. జలశక్తిలాగే, యువశక్తి కూడా చాలా గొప్పదని, సరైన మార్గంలోకి నిర్మాణాత్మక రీతిలో క్రమబద్ధీకరిస్తే జీవితానికి అదే ఆధారభూతమవుతుందని అన్నారు. ఈ రకంగా చూస్తే 'జలశక్తి', 'యువశక్తి' సమానస్థాయి కలిగిన శక్తి రూపాలని ఆయన అన్నారు.

చిన్నపాటి చర్యలు కూడా భారీ ఫలితాలను అందిస్తాయని అశోక్ కుమార్ అభిప్రాయపడ్డారు. జలశక్తి అభియాన్ పథకం కింద, -వర్షం నీటిని ఒడిసి పట్టు- అనే కార్యక్రమం పేరిట 47లక్షలకు పైగా జల సంరక్షణ నిర్మాణాలు రూపుదాల్చడం ఎంతో ఆనందదాయకమని అన్నారు. మొదటగా చిన్న చిన్న నదులు, చిన్న ఏర్లు, కాలువలను పునరుద్ధరించడం ద్వారా దేశంలో జలసంరక్షణను ప్రారంభించాలని ఆయన సూచించారు. నదీ జలాలను పొదుపుచేయడమే కాక, నీటిని, నదులను గౌరవించే ఆనవాయితీని యువత అలవర్చుకునేలా, ప్రముఖ శిక్షకులు, ప్రబోధకులు తగిన కృషి చేయాలని అన్నారు.

హర్యానాకు చెందిన అమిటీ విశ్వవిద్యాలయం వైస్ చాన్సిలర్ డాక్టర్ పి.బి. శర్మ, ఢిల్లీ రాజధాని ప్రాంతానికి చెందిన కె.ఐ.ఇ.టి. గ్రూపు సంస్థల డీన్ డాక్టర్ శైలేంద్ర కుమార్ తివారీ, గ్రేటర్ నోయిడాకు చెందిన శారదా విశ్వవిద్యాలయం టీచింగ్, లెర్నింగ్ విభాగం డైరెక్టర్ డాక్టర్ సూర్య ప్రసాదరావు సువ్వారు తదితర నిపుణులు ఈ వెబ్ సిరీస్ కార్యక్రమంలో ప్యానెలిస్టులుగా పాలుపంచుకున్నారు.

డాక్టర్ పి.బి. శర్మ మాట్లాడుతూ, యువత హృదయాల్లోనే కాకుండా, ఇంజినీర్లు, శాస్త్రవేత్తలు, పురపాలక అధికారులు, ఇతర భాగస్వామ్య వర్గాల మనసుల్లో కూడా నదుల సంరక్షణ, పునరుజ్జీవం అనే భావనను రగిలించాలని చెప్పారు. జలసంరక్షణకోసం విస్తృతస్థాయిలో వ్యూహాలను అనుసరించవలసిన అవసరం ఉందన్నారు. సుస్థిర జల వినియోగం పాటించడం, నీటి వాడకం అలవాట్లను సవరించుకోవడం, నీటి సంరక్షణను అలవర్చుకునేలా జీవన శైలిని మార్చుకోవడం మన దేశానికి తప్పనిసరి అవసరాలని అన్నారు. ఇందుకోసం దేశవ్యాప్తంగా 'జల సాంకేతిక పరిజ్ఞాన కేంద్రాలు' తదితర సంస్థలను స్థాపించవలసిన అవసరం ఉందన్నారు.

డాక్టర్ శైలేంద్ర కుమార్ తివారీ మాట్లాడుతూ, మన దేశంలోని నదీ జల పర్యావరణ వ్యవస్థలు,.. జీవ, జీవేతర వనరుల సంక్లిష్టమైన మిశ్రమరూపాలని, మనం ఎంతో జాగరూకతతో నదీజలాల వ్యవస్థను సంరక్షించుకోవాలని అన్నారు. సుస్థిర అభివృద్ధిపై మనం నిర్దేశించుకున్న 17 లక్ష్యాల్లో పర్యావరణ సుస్థిరతకు ఎంతో ప్రాధాన్యం ఇచ్చారని, నదులను శాశ్వత వనరులుగా పరిగణించి, వాటి పర్యావరణ సమగ్రతను కాపాడుకోవడం చాలా ముఖ్యమని ఆయన అన్నారు.

డాక్టర్ సూర్యప్రసాద రావు సువ్వారు మాట్లాడుతూ, జలసంరక్షణ, నదుల పునరుజ్జీవానికి సంబంధించి నిర్వహించే సమాజ అనుసంధాన కార్యక్రమాలు ఎప్పటికీ అద్భుతమైన సత్ఫలితాలను అందిస్తాయన్నారు. సామాజికంగా సమంజసమైన, నిర్వహణా సౌలభ్యంతో కూడిన ప్రాజెక్టులను చేపట్టేలా విద్యార్థులను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతో ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. వాటర్ రీసైక్లింగ్, నీటి పునర్వినియోగానికి పటిష్టమైన పద్ధతులను తప్పనిసరిగా అనుసరించాలని ఆయన సూచించారు.

టాలీవుడ్‌కి సీఎం జగన్ తాయిలం - రాజ్యసభకి కమెడియన్ అలీ !

అమరావతి, ఫిబ్రవరి 10:నేడు టాలీవుడ్ ప్రముఖులు పలువురు సీఎం జగన్ ని కలిసి సినీ పరిశ్రమలో ఉన్న పలు సమస్యలపై చర్చించారు. కాగా ఈ సమస్యలపై సీఎం జగన్ సానుకూలంగా స్పందించారట. ఈ మేరకు రెండు వారాల్లో ఉత్తర్వులు జారీ చేయనున్నారని సమాచారం. కాగా ఈ మీటింగ్ కి కమెడియన్ అలీ కూడా వెళ్ళారు. అయితే అలీకి ఓ బంఫర్ ఆఫర్ వచ్చిందట. నేటి వరకు సినీ రంగం మద్దతు వైసీపీకి లేదు అనే విషయం తెలిసిందే. 2019 ఎన్నికల్లో కూడా చిన్న నటులు తప్ప, పెద్ద స్టార్లు ఎవరూ వైసీపీ వైపు చూడలేదు. అయినా 151 సీట్ల మెజారిటీతో జగన్ అధికారంలోకి వచ్చారు. ఆ తరువాత కూడా ఆయనకు అభినందనలు కూడా సినీ సీమ నుంచి పెద్దగా లేవు అని అని వైసీపీ నేతలు బాధపడిన సందర్భాలు ఉన్నాయి. సినీ పెద్దగా చరిష్మాటిక్ స్టార్ గా ఉన్న చిరంజీవికి రాజ్యసభ సీటు ఇచ్చి దగ్గర చేసుకోవాలని పార్టీ ఎత్తుగడ చేసిందనేది సమాచారం. కానీ అది సాధ్యం కాదని తేలిపోయింది. తాను రాజకీయాలకి దూరమని చిరంజీవి స్పష్టం చేశారు. ఇప్పుడు ఓ విషయం వైరల్ అవుతోంది.

మైనారిటీ కార్డు తో పాటు సినీ రంగాన కమెడియన్ గా తనకంటూ ఒక స్థానాన్ని సంపాదించుకున్న అలీని ముందు పెట్టి టాలీవుడ్ తో గ్యాప్ ని తగ్గించుకోవాలని వైసీపీ భావిస్తోందట. ఈ క్రమంలో అలీకి రాజ్యసభ సీటు కన్ఫర్మ్ చేస్తారనే టాక్ వినిపిస్తోంది. సినీ ప్రముఖులతో జగన్ జరిపిన భేటీకి అలీ కూడా వచ్చారు. ఈ సందర్భంగా అలీని జగన్ మళ్లీ మనం కలుద్దామని చెప్పారట. ఈ మళ్లీ కలుద్దాం అన్న మాట అయితే ఇపుడు తెగ వైరల్ అవుతోంది. జగన్, అలీని కలుద్దామని అన్నారూ అంటే కచ్చితంగా రాజ్యసభ సీటు ఆఫర్ కే అని ప్రచారం గట్టిగా సాగుతోంది..నిజానికి అలీ ఎమ్మెల్సీ పదవిని కోరుకున్నారు. ఇప్పటికి మూడు విడతలుగా ఎమ్మెల్సీ పోస్టులు భర్తీ అయ్యాయి. ఆ మధ్య అయితే ఎమ్మెల్సీ ఖాళీల ఎంపికకు ముందే, అలీ జగన్ ని కలసి వచ్చారు. మర్యాద పూర్వకమైన భేటీ ఇది అని నాడు చెప్పినా ..తన మనసులో మాటను సీఎం చెవిన అలీ వేసి వచ్చారు అని ప్రచారం జరిగింది.అయితే ఎమ్మెల్సీ పోస్టులలో జగన్ పార్టీ విధేయులకే కట్టబెట్టారు. ఇపుడు రాజ్య సభ చాన్స్ వచ్చింది. దాంతో చాలా మంది బిగ్ షాట్స్ కన్ను పడింది. తమకంటే తమకు వస్తుందని అంతా ఎదురుచూస్తున్న టైమ్ లో సడెన్ గా అలీ పేరు తెర మీదకు రావడం విశేషం.ఇక అలీ 2019 ఎన్నికలకు ముందు వైసీపీలో చేరారు. ఆనాడు ఆయన ఎమ్మెల్యే టికెట్ కోరుకున్నారు. రాజమండ్రీకి చెందిన అలీకి టికెట్ కేటాయించ లేకపోయారు. దాంతో అధికారంలోకి వస్తే ఏదో ఒక పదవి ఇస్తామని చెప్పారు. దానికి తగిన విధంగా ఇపుడు పెద్దల సభలో అలీ అడుగుపెట్టబోతున్నారు అని అంటున్నారు. ఎమ్మెల్సీగా నెగ్గి మంత్రి పదవి చేపట్టాలని ఉర్రూతలూరుతున్న అలీకి రాజ్యసభ పదవి అంటే ఒక విధంగా ఆనందకరమే అని చెప్పాలి. ఆరేళ్ల పాటు హాయిగా అలీ పెద్దల సభలో ఉండవచ్చు. మొత్తానికి చూస్తే అలీకి పదవి ఇవ్వడం ద్వారా సినీ రంగాన్ని గౌరవించాలన్న జగన్ ఆలోచన కూడా ఉంది.

జీఎంఆర్ హైదరాబాద్ విమానాశ్రయానికి రెండోసారి 'వాయిస్ ఆఫ్ కస్టమర్' గుర్తింపు

హైదరాబాద్, ఫిబ్రవరి 10:జీఎంఆర్ హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి (ఉఊఎంఒ) వరుసగా రెండోసారి ంఅఎ వరల్డ్ (ఎయిర్‌పోర్ట్స్ కౌన్సిల్ ఇంటర్నేషనల్) వారి "వాయిస్ ఆఫ్ కస్టమర్" గుర్తింపు లభించింది. 2021లో కోవిడ్ సమయంలో ప్రయాణీకుల అవసరాలను అర్థం చేసుకుని, దానికి తగిన చర్యలను తీసుకుంటూ చేసిన నిరంతర కృషికి ఈ గుర్తింపు లభించింది. విమాన ప్రయాణంపై ప్రయాణీకుల విశ్వాసాన్ని పునరుద్ధరించడంలో పోషించిన చురుకైన పాత్రకు గాను హైదరాబాద్ విమానాశ్రయానికి ఈ గుర్తింపు దక్కింది. ఈసందర్భంగా జీఎంఆర్ హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయ సీఈఓ ప్రదీప్ పణికర్ వరుసగా రెండోసారి ఈ గుర్తింపును పొందడం తమకు దక్కిన గౌరవమన్నారు.

తమ భాగస్వాములందరి సహకారంతోనే ఇది సాధ్యమైందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రయాణికుల విశ్వాసాన్ని పొందడానికి ఉమ్మడిగా కృషి చేయడం చాలా అవసరమన్నారు. తెలంగాణ ప్రభుత్వ సహకారంతో తాము విమానాశ్రయంలో కోవిడ్ నిబంధనల అమలుకు స్పెషల్ పోలీస్ ఆఫీసర్లు, ప్రయాణికుల భద్రత కోసం వీడియో అనలిటిక్స్ వినియోగం, అదనపు ఆర్టీ-పీసీఆర్ ల్యాబ్ ఏర్పాటు వంటి అనేక చర్యలు తీసుకున్నామన్నారు. విమానాశ్రయ ఆపరేటర్‌గా తమకు ప్రయాణికుల భద్రత అత్యంత ముఖ్యమన్నారు. దానికోసం అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటామన్నారు. జీఎంఆర్ హైదరాబాద్ విమానాశ్రయంతో పాటు జీఎంఆర్ నిర్వహిస్తున్న మరో విమానాశ్రయం, ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికీ ఈ గుర్తింపు లభించిందని తెలిపారు.

పంజాబ్ ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్న కేజ్రీవాల్ భార్య, కుమార్తె

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10:పంజాబ్ లో ఎన్నికల ప్రచారం ముమ్మరంగా కొనసాగుతోంది. ఇప్పటికే పలుమార్లు ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ పంజాబ్ లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కాగా కేజ్రీవాల్ భార్య సునీత, కుమార్తె హర్షితలు కూడా పంజాబ్ ఎలక్షన్ ప్రచారంలో పాల్గొననున్నారట. వచ్చే వారంలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆమ్ ఆద్మీ పార్టీ తరపున ప్రచారం చేసేందుకు శుక్రవారం వారు పంజాబ్‌కు రానున్నారు. ఈ విషయాన్ని స్వయంగా కేజ్రీవాల్ భార్య ట్విట్టర్ వేదికగా వెల్లడించారు. రేపు నేను నా బావ భగవంత్ మాన్ కోసం ఓట్లు అడగడానికి నా కుమార్తెతో కలిసి ధురీ (సంగ్రూర్ జిల్లాలో) ఎన్నికల ప్రచారానికి వెళ్తున్నాను" అని కేజ్రీవాల్ భార్య సునిత ట్వీట్ చేశారు.

ఇప్పుడీ ట్వీట్ వైరల్ అవుతోంది.ఫిబ్రవరి 11న పంజాబ్ లోని సంగ్రూర్ జిల్లా ధూరిలో ఆప్ ముఖ్యమంత్రి అభ్యర్థి భగవంత్ మాన్ నిర్వహించే జన్ సభకు ఢిల్లీ సీఎం కేజ

కష్టపడి సాధించిన తెలంగాణ రాష్ట్రాన్ని ఇష్టపడి పాలిస్తున్న ముఖ్యమంత్రి కేసిఆర్

ప్రధాని చేసిన అనుచిత వ్యాఖ్యలపై టీఆర్ఎస్ శ్రేణులు నల్లబ్యాడ్జీలతో నిరసన, దిష్టిబొమ్మ దహనం

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 10:(నేటినిజం ప్రతినిధి):తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై ప్రధాని మోడీ చేసిన అనుచిత వ్యాఖ్యల భగ్గుమన్న వేములవాడ టీఆర్ఎస్ శ్రేణులు బుధవారం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే టి రామారావు ఆదేశాల మేరకు వేములవాడ శాసనసభ్యులు చెన్నమనేని రమేష్ బాబు కి టిఆర్ఎస్ పార్టీ పట్టణ , రూరల్,అర్బన్ మండలాల ఆధ్వర్యంలో నిన్నటి రోజున రాజ్యసభలో ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణ ఏర్పాటుపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు పట్టణంలోని తెలంగాణ చౌక్ వద్ద నల్ల బ్యాడ్జిలతో నిరసనను తెలుపుతూ నరేంద్ర మోదీ దిష్టి బొమ్మని దహనం చేశారు అనంతరం బైక్ ర్యాలీతో వెళ్లి అమరవీరుల స్తూపం వద్ద తెలంగాణ అమరులకు నివాళులు అర్పించడం జరిగింది.ప్రధాన మంత్రి తెలంగాణ రాష్ట్ర ప్రజలను అవమానపరిచె విందంగా మాట్లాడారు.

ముఖ్యమ్రంత్రి కేసిఅర్ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు 14 సంవత్సరాల సుదీర్ఘపోరాటంతో పాటు సకలజనుల సమ్మెతో అనెక ఉధ్యమాలు చెపట్టి తెలంగాణను సాదించారు

తెలంగాణకోసం 12వందల మందిఅమరులైనారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 8 ఏండ్లు కావస్తున్నప్పటికి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణపై విషం చిమ్మడం, నిర్లక్ష్య పూరితంగవ్యవహరించడం సరికాదంటూ టిఆర్ఎస్ పార్టీ నాయకులు మండిపడ్డారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పట్టణ అధ్యక్షుడు పుల్కం రాజు ,అర్బన్ అధ్యక్షుడు ఉదరి ప్రవిణ్ ,రూరల్ అధ్యక్షుడు ,గోస్కుల రవి,మార్కెట్ కమిటి అధ్యక్షులు గడ్డం హన్మండ్ల ,జడ్పిటిసి మేకల రవి ,మున్సిపాల్ వైస్ చెర్మెన్ మధు రాజ్కిందర్ ,సింగిల్ విండో చేర్మన్ కృష్ణదెవరావు గ,అర్బన్ మండల వైస్ చెర్మన్ ఆర్ సి రావు కౌన్సిల్లర్లు,మాజి సెస్ డైరెక్టర్లు రామాతీర్థపు రాజు,జడల శ్రీనివాస్,కోఅప్షన్ సభ్యులు,ఎంపిటిసిలు,సర్పంచ్లు, మార్కెట్ కమిటి డైరెక్టర్లు,సీనియర్ నాయకులు,గ్రామా శాఖ,వార్డు అధ్యక్షులు,అనుబంద సంఘాలఅధ్యక్షులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

మమ్మల్ని ఆదుకోండి - బాధితురాలి లేఖపై స్పందించిన మంత్రి కేటీఆర్

హైదరాబాద్, ఫిబ్రవరి 10:సోషల్ మీడియాలో మంత్రి కేటీఆర్ ఎంత యాక్టీవ్ గా ఉంటారో అందరికి తెలుసు. పలు సమస్యలపై ఆయన తక్షణమే స్పందిస్తూ ఉంటారు. సమస్యను బట్టి ఆయన రెస్పాన్స్ అవుతుంటారు. కాగా ఓ వివాహిత రాసిన లెటర్ పై మంత్రి కేటీఆర్ స్పందించారు. ఆమె ఏమని రాశారంటే తన పేరు అనీషా అని, తాను సికింద్రాబాద్ లో ఉంటానని తెలిపారు. కాగా ఆమె భర్త కోవిడ్ వల్ల చనిపోయాడని, తనకి ఇద్దరు పిల్లలు, ఒకరికి 5సంవత్సరాలు, మరొకరికి 2సంవత్సరాలని లెటర్ లో తెలిపారు. ఇంటి అద్దె కూడా కట్టలేని పరిస్థితిలో ఉండటం వల్ల , ఇంటి యజమాని తమని ఇల్లు ఖాళీ చేయించాడని, పిల్లలతో సహా తాను రోడ్డుపై పడ్డానని ఆవేదన వ్యక్తం చేసింది. దిక్కు తోచని పరిస్థితుల్లో తాను ఆత్మహత్య చేసుకునే ప్రయత్నం చేశానని వెల్లడించింది. టిఆర్ ఎన్ ప్రభుత్వం తరపున తమని ఆదుకోవాలని ఆమె లేఖలో తెలిపింది. కాగా ఈ లేఖపై మంత్రి కేటీఆర్ స్పందించారు. మహిళా అభివృద్ధి , శిశు సంక్షేమ శాఖకి బాధితురాలు రాసిన లేఖని రీ ట్వీట్ చేసి, ఆమెను ఆదుకోవాలని తెలిపారు.

రాష్ట్ర మున్సిపల్, నగర పంచాయితీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి గా గోలి మహేష్



రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 10:(నేటి నిజం ప్రతినిధి):తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ , నగర పంచాయతీ ల కౌన్సిలర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గా వేములవాడ 27 వ వార్డు కౌన్సిలర్ గోలీ మహేష్ నియమితులయ్యారు .గురువారం తెలంగాణ రాష్ట్రమున్సిపల్ ,నగర పంచాయితీల కౌన్సిలర్స్ అసోసియేషన్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు కె ఎల్ ఎన్ ప్రసాద్ నియామక పత్రాన్ని అందజేశారు ఈ సందర్భంగా నియమితులైన గోలి మహేష్ మాట్లాడుతూ రాష్ట్ర మున్సిపల్ కౌన్సిలర్ యొక్క హక్కులకై,సమస్యల కోసం పోరాడతానని అని అన్నారు ,ఈ సందర్భంగా పలువురు కౌన్సిలర్లు హర్షం వ్యక్తం చేశారు.తనను నియమించిన మున్సిపల్ ,నగర పంచాయితీ ల కౌన్సిలర్స్ అసోసియేన్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు కె ఎన్ ఎల్ ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గడ్డమీద శ్రీనివాస్ వంగ శ్రీనివాస్ , రామతీర్థపు హరీష్ తదితరులు పాల్గొన్నారు

అంతర్జాతీయ జర్నల్‌కి ఎంపిక

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 10:(నేటినిజం ప్రతినిధి):వేములవాడ మండల పరిధిలో గల స్థానిక అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా. తిరుకోవెల శ్రీనివాస్ "తెలంగాణలోని హైదరాబాద్‌లోని హుస్సేన్ సాగర్ సరస్సు యొక్క ఫిజికోకెమికల్ ప్రాపర్టీస్ ఆఫ్ వాటర్ రిఫరెన్స్‌తో డయాటమ్స్ వైవిధ్యాలపై అధ్యయనాలు పరిశోధక వ్యాసం అంతర్జాతీయ జర్నల్లో ప్రచురణకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డా. వడ్లూరి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఘనత సాధించినందుకు ఆయనను కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు సిబ్బంది అభినందనలు తెలిపారు.

బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు పక్కాగా చేపట్టాలి : మంత్రి శ్రీనివాస్ గౌడ్

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 10: : ఈ నెల 11 నుంచి 18 వరకు నిర్వహించనున్న మన్యంకొండ శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి, మార్చి 16 నుంచి 20 వరకు నిర్వహించే అలివేలు మంగ అమ్మవారి బ్రహ్మోత్సవాలను పక్కాగా చేపట్టాలని సాంస్కృతిక ,పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అధికారులను ఆదేశించారు.

గురువారం ఆయన జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మన్యంకొండ శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల నిర్వహణ పై ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో మాట్లాడారు. మన్యంకొండకు పేదల తిరుపతిగా పేరుంది ఈ క్షేత్రానికి ప్రతి సంవత్సరం భక్తుల సంఖ్య పెరుగుతున్నదన్నారు.

దీన్ని దృష్టిలో ఉంచుకుని ఈ సంవత్సరం పెద్దఎత్తున ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకుగాను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని మంత్రి తెలిపారు.

మన్యంకొండ దేవాలయం వద్ద భక్తులకు 18 గదులు నిర్మాణంలో ఉన్నాయని, అదేవిధంగా ఏసీ ఫంక్షన్ హాల్ కూడా నిర్మాణం లో ఉందని తెలిపారు. మహబూబ్ నగర్– రాయచూరు రహదారి మన్యంకొండ ఆర్చి నుంచి కొండ పై వరకు రహదారికి ఇబ్బందులు లేకుండా చూడాల పేర్కొన్నారు.

రోడ్డు మధ్యలో డివైడర్, లైటింగ్ ఏర్పాటు చేయాలని, ఫూట్ పాత్ తో పాటు, మొక్కలు పెట్టాలని, బ్రహ్మోత్సవాలలో పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొండపైన, అలివేలు మంగ అమ్మవారి దేవాలయం వద్ద తాత్కాలిక షీ టాయిలెట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

హెల్ప్ డెస్క్ తో పాటు, కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ఏ సమస్యలు ఉన్నా వెంటనే పరిష్కరించాలన్నారు. భక్తుల సౌకర్యార్థం సూచిక బోర్డులతో పాటు పార్కింగ్ సదుపాయం ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆర్టీసీ ద్వారా కొండపైకి ప్రత్యేక బస్సులు నడపాలని, అదేవిధంగా పర్యాటక శాఖ ద్వారా ప్రత్యేక ప్యాకేజీ తో స్పెషల్ బస్సును ఏర్పాటు చేయాలని పర్యాటక శాఖ అధికారిని ఆదేశించారు.

అలివేలు మంగ అమ్మవారి దేవస్థానం వద్ద చెరువును మినీ ట్యాంక్ బండ్ లో తీర్చిదిద్దాలని ఆదేశించారు.

కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావు, ఎస్పీ ఆర్. వెంకటేశ్వర్లు, లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ చైర్మన్ మధుసూదన్ ,స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు రాజేశ్వర్ గౌడ్, రైతుబంధు డైరెక్టర్ నరసింహారెడ్డి, ఎంపీపీ సుధా శ్రీ, వైస్ ఎంపీపీ అనిత,తదితరులు పాల్గొన్నారు.

సైబర్ దాడుల నుండి భారతీయ అణు స్థావరాలు మరియు అణు విద్యుత్ కేంద్రాలు సురక్షితంగా ఉన్నాయి- కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10:కేంద్ర సైన్స్ ఉ టెక్నాలజీ సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత); ఎర్త్ సైన్సెస్ సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత);ఎంఓఎస్ పిఎంఓ, పర్సనల్, పబ్లిక్ గ్రీవెన్స్, పెన్షన్స్, అటామిక్ ఎనర్జీ మరియు స్పేస్ డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడుతూ భారత అణు స్థావరాలు మరియు అణు విద్యుత్ కేంద్రాలు సైబర్ దాడుల నుండి సురక్షితంగా ఉన్నాయని అన్నారు.

రాజ్యసభలో ఒక ప్రశ్నకు వ్రాతపూర్వక సమాధానంలో డాక్టర్ జితేంద్ర సింగ్ ''భారత అణు స్థావన దాని ఇన్‌స్టాలేషన్‌లలో ఉపయోగించే సిస్టమ్‌ల రూపకల్పన, అభివృద్ధి మరియు ఆపరేషన్ కోసం ఇప్పటికే కఠినమైన విధానాన్ని కలిగి ఉంది. భద్రత మరియు భద్రతా క్లిష్టమైన సిస్టమ్‌లు కస్టమ్ బిల్ట్ హార్డ్‌వేర్ మరియు సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి అంతర్గతంగా రూపొందించబడ్డాయి మరియు అభివృద్ధి చేయబడ్డాయి. ఇవి రెగ్యులేటరీ వెరిఫికేషన్ మరియు ధ్రువీకరణకు లోబడి ఉంటాయి, తద్వారా సైబర్ సెక్యూరిటీ బెదిరింపులకు నిరోధకతను కలిగి ఉంటాయి'' అని తెలిపారు.

నియంత్రణ నెట్‌వర్క్ మరియు ప్లాంట్‌ల భద్రతా వ్యవస్థలు వంటి భారతీయ అణు సంస్థల భద్రత మరియు భద్రతా కీలకమైన మౌలిక సదుపాయాలు ఇంటర్నెట్ మరియు స్థానిక ఐటీ నెట్‌వర్క్ నుండి వేరు చేయబడ్డాయి.

డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీలో కంప్యూటర్ మరియు ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ అడ్వైజరీ గ్రూప్ (సిఐఎస్ఏజి) మరియు డిఏఈ యూనిట్ల సైబర్ సెక్యూరిటీ/సమాచార భద్రతను చూసేందుకు టాస్క్ ఫోర్స్ ఫర్ ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్ సెక్యూరిటీ (టిఎఎఫ్ఐసిఎస్) వంటి స్పెషలిస్ట్ గ్రూపులు ఉన్నాయి. వ్యవస్థలు మరియు ఆడిట్‌లను ధృడపరచడం ద్వారా అణు సౌకర్యాలతో సహా డీఏఈ కింద అన్ని యూనిట్ల సైబర్ భద్రతను బలోపేతం చేసే ప్రక్రియను ఈ సమూహాలు చేపట్టాయి.

సమ్మక్క-సారలమ్మ జాతరకు ప్రత్యేక బృందాలు : హరీశ్ రావు

హైదరాబాద్, ఫిబ్రవరి 10:సమ్మక్క, సారలమ్మ జాతరకు ప్రత్యేక బృందాలు పెడతామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు తెలిపారు. ఈరోజు వరంగల్ జిల్లాలో ఎం.జీ.ఎం హాస్పిటల్లో పిల్లల కోవిడ్ ప్రత్యేక సంరక్షణ విభాగం, ప్రభుత్వ ప్రసూతి దవాఖానలో పిల్లల కోవిడ్ ప్రత్యేక సంరక్షణ విభాగం, టి.బి హాస్పిటల్లో ప్రత్యేక వార్డు, మథర్ మిల్క్ బ్యాంక్, బ్లడ్ స్టోరేజ్ యూనిట్ ప్రారంభించి, హన్మకొండలో టి. డయాగ్నోస్టిక్ హబ్ ఏర్పాటు కోసం మంత్రులు హరీష్ రావు శంకుస్థాపన చేశారు.

ఈ కార్యక్రమంలో మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్, ప్రభుత్వ చీఫ్ విప్ వినయ్ భాస్కర్, ఎంపి దయాకర్, మేయర్ గుండు సుధారాణి, ఎమ్మేల్యేలు నరేందర్, అరూరి రమేష్, శంకర్ నాయక్ ఎమ్మెల్సీలు బండ ప్రకాష్, సారయ్య, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, టీఎస్ఎంఎస్ఐడీసీ ఛైర్మెన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, ఇతర స్థానిక నేతలు, అధికారులు పాల్గొన్నారు.

ఈసందర్భంగా మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ. మేడారం సమ్మక్క సారలమ్మ జాతరలో వైద్య ఆరోగ్య సేవలు పూర్తిస్థాయిలో అందించాలని మంత్రి సత్యవతి రాథోడ్ కోరిన మేరకు వెంటనే వైద్య, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు శ్రీనివాస్, వాకాటి కరుణలను పంపించి కావలసిన వసతులు ఏర్పాటు చేయిస్తానని మంత్రి హరీష్ రావు తెలిపారు.

వరంగల్ నేతలు కోరినట్లు త్వరలోనే రెండు రోజుల పాటు వరంగల్, హనుమకొండలో ఉండి వైద్య ఆరోగ్య శాఖపై పూర్తి స్థాయి సమీక్ష చేస్తానన్నారు. హనుమ కొండ కొత్త జిల్లాలో 3.5 కోట్ల రూపాయలతో టి.డయాగ్నస్టిక్ సెంటర్, రేడియాలజీ లాబ్, ఇచ్చామని, వచ్చే నాలుగు నెలల్లో పూర్తి చేస్తామన్నారు.

భారతీయ సంస్కృతి, హిందు ధర్మాన్ని కాపాడుకోవాలి - ఉపరాష్ట్రపతి పిలుపు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10:భారతీయ సంస్కృతి సంప్రదాయాలను, హిందూ ధర్మాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఉపరాష్ట్రపతి శ్రీ ముప్పవరపు వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. కుమార్తె శ్రీమతి దీపావెంకట్ గారి కూతురు కుమారి సుష్మ వివాహ మహోత్సవం కోసం ఉపరాష్ట్రపతి తిరుమల చేరుకుని సతీమణి శ్రీమతి ఉషమ్మ, కుమారుడు శ్రీ హర్షవర్ధన్, కోడలు శ్రీమతి రాధమ్మ సహా ఇతర కుటుంబ సభ్యులతో కలిసి గురువారం ఉదయం తిరుమల శ్రీనివాసుని దర్శించుకున్నారు. ప్రోటోకాల్ ప్రకారం మహద్వారం నుంచి దర్శనం చేసుకునే అవకాశం ఉన్నా, మామూలు భక్తునిలా వైకుంఠ ద్వారం నుంచి దర్శనం చేసుకున్నారు.

సాధారణ భక్తులకు దర్శనాన్ని కల్పించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం చేస్తున్న కృషిని ఈ సందర్భంగా అభినందించిన ఉపరాష్ట్రపతి, ఈ విషయంలో ప్రముఖులుసైతం సహకారం అందించాలని సూచించారు. ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు ఏడాదికి ఒక్కసారే దర్శనానికి రావాలని, సామాన్య భక్తులకు అవకాశం కల్పించాలని సూచించారు. తిరుమల శ్రీనివాసుని దర్శించుకోవడం ద్వారా సంతోషం, సంతృప్తి లభిస్తుందన్న ఉపరాష్ట్రపతి దాని ద్వారా ప్రజలకు మరింత సేవ చేసేందుకు స్ఫూర్తి కలుగుతుందన్నారు. ఆధ్యాత్మికత అంటే సేవామార్గమన్న ఆయన, అందరం దీన్ని గుర్తించి ఆచరించాలని సూచించారు. ఆలయ దర్శనమంటే భగవంతుడు చూపిన బాటలో ముందుకు నడవడమేనని, సాటి వారికి చేసే సేవలో నిజమైన భగవద్దర్శనం సాధ్యమౌతుందని తెలిపారు.

కవిసంధ్య , సాహిత్య సాంస్కృతిక సంస్థ, యానాం

ప్రముఖ కవి విన్నకోట రవిశంకర్ కవితా సంపుటి

మంచు కరిగాక

ఆవిష్కరణ సభ

అధ్యక్షులు:
శ్రీ శిఖామణి

ముఖ్య అతిథి, ఆవిష్కర్త:
శ్రీ కె.శివారెడ్డి

గౌరవ అతిథి :
శ్రీ వాడ్రేవు చినవీరభద్రుడు

విశిష్ట అతిథి :
శ్రీ అంపశయ్య నవీన్

ఆత్మీయ అతిథులు :
శ్రీ కొప్పర్తి వెంకట రమణ మూర్తి,
శ్రీ రవూఫ్,
శ్రీమతి మానస చామర్తి
శ్రీ వెంకట్ శిద్దారెడ్డి

అంకిత స్వీకరణ :
శ్రీ ఇంద్రగంటి సుబ్బరాయ శాస్త్రి

కవి స్పందన:
శ్రీ విన్నకోట రవిశంకర్

ఆహ్వానం:
శ్రీ దాట్ల దేవదానం రాజు

ముగింపు:
శ్రీ ముమ్మిడి చిన్నారి

13, ఫిబ్రవరి 2022,
ఆదివారం, సాయంత్రం 5:30 గంటలకు
వేదికపై
zoom
Meeting ID: 812 0609 7506
Passcode: 270318



టీఎస్ఆర్టీసీలో గరుడ ప్లస్ బస్సు చార్జీల తగ్గింపు..

హైదరాబాద్, ఫిబ్రవరి 10:గరుడ ప్లస్ బస్సు చార్జీలను తగ్గిస్తూ టీఎస్ ఆర్టీసీ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు తగ్గింపు చార్జీల విషయాన్ని మంత్రి పువ్వాడ తెలియజేశారు. ప్రయాణీకులకు మంచి ప్రయాణం అందేంచేందుకు వీలుగా ఏసీ గరుడ ప్లస్ చార్జీలను రాజధాని టిక్కెట్టుకు సమానంగా సవరించినట్టు ఆయన తెలిపారు. మంత్రి సూచన మేరకు ఎండీ సజ్జనార్ చార్జీలను సవరించినట్టు తెలిపారు. దీంతో ఎంచక్కగా రాజధాని ఫేర్ తో గరుడ ప్లస్ బస్సులో ప్రయాణించొచ్చుని సంస్థ స్పష్టం చేసింది. ఈ సవరించిన చార్జీల షెడ్యూల్ , ప్రత్యేక సర్వీసులకు మార్చి 31 వరకు వర్తించనుంది.

కాగా, అంతరాష్ట్ర సర్వీసుల్లో అయితే తెలంగాణ సరిహద్దు దాటిన తర్వాత అంతకు మునుపు ఉన్న అంతరాష్ట్ర భాగంలో వర్తించే చార్జీలు వసూలు చేయనున్నట్లు ఎండీ సజ్జనార్ తెలిపారు. కర్నాటక ఆర్టీసీతో సమానంగా ప్లెక్సీ ఛార్జీలు అమలులో ఉన్న హైదరాబాద్ ? బెంగళూరు మార్గంలో నడిచే ఏసీ సర్వీసులకు మాత్రం ఇది వర్తించదని స్పష్టం చేశారు. రవాణా రంగంలో ఉన్న పోటీని తట్టుకుని నిలబడడానికి ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని సంస్థ ఎం.డి సజ్జనార్ అన్నారు.

హైదరాబాద్ – విజయవాడ మధ్య రూ .100, హైదరాబాద్– ఆదిలాబాద్ మధ్య రూ .111, హైదరాబాద్ ? భద్రాచలం మధ్య రూ .121, హైదరాబాద్– వరంగల్ మధ్య రూ .54 లు తగ్గినట్లు ఆయన వివరించారు.

ఉగాది నుంచే కొత్త జిల్లాలు: సీఎం జగన్

అమరావతి, ఫిబ్రవరి 10: రాష్ట్రంలో ఉగాది నుంచే కొత్త జిల్లాలు ఏర్పాటు అవుతాయని సీఎం జగన్ తెలిపారు. సీఎస్, ఇతర ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఉగాది నాటికి కొత్త జిల్లాలు ఏర్పాటు అవుతాయన్నారు. ఉగాది నుంచే కలెక్టర్లు, ఎస్పీల కార్యకలాపాలు నిర్వహించాలన్నారు. దానికి సంబంధించిన సన్నాహాలు చేయాలని అధికారులను జగన్ ఆదేశించారు. ప్రస్తుతమున్న కలెక్టర్లు, ఎస్పీలకు కొత్త జిల్లాల బాధ్యతలు అప్పగించాలన్నారు. పరికున్న అనుభవం కొత్త జిల్లాలకు ఉపయోగపడుతుందని సీఎం అన్నారు. పరిపాలన సాఫీగా సాగడానికి వీరి అనుభవం ఉపయోగపడుతుందని సీఎం తెలిపారు. కొత్త జిల్లాలపై నోటిఫికేషన్ వచ్చిన రోజునుంచే ఓఎస్డీల హోదాలో కొత్త జిల్లాలకు కలెక్టర్లు, ఎస్పీలు బాధ్యతలు నిర్వహిస్తారన్నారు.

రాష్ట్రంలో ఇప్పుడున్న జిల్లాలకు అదనంగా 13 జిల్లాలను కలుపుతూ 26 జిల్లాలను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చిన సంగతి తెలిసిందే. పార్లమెంట్ నియోజకవర్గానికొక జిల్లాను ఏర్పాటు చేశారు.

1975 సంవత్సరం నుండి ISROభారత సంతతికి చెందిన 129 ఉపగ్రహాలను 36 దేశాలకు చెందిన 342 విదేశీ ఉపగ్రహాలను ప్రయోగించింది: కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10:కేంద్ర సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత) సైన్స్ ఉ టెక్నాలజీ; ఎర్త్ సైన్సెస్; డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడుతూ 1975 నుంచి భారత సంతతికి చెందిన మొత్తం 129 ఉపగ్రహాలు, 36 దేశాలకు చెందిన 342 విదేశీ ఉపగ్రహాలను ఇస్రో ప్రయోగిం చిందని, వీటిలో దాదాపు 39 ఉపగ్రహాలు వాణిజ్య ఉపగ్రహాలు, మిగిలినవి నానో–ఉపగ్రహాలు అని చెప్పారు.

రాజ్యసభలో ఒక ప్రశ్నకు వ్రాతపూర్వక సమాధానంలో, ఈ రోజు భారతదేశం అంతరిక్షంలో మొత్తం 53 కార్యాచరణ ఉపగ్రహాలను కలిగి ఉంది, ఇది దేశానికి వివిధ గుర్తించబడిన సేవలను అందిస్తున్నాయి. వీటిలో 21 కమ్యూనికేషన్ ఉపగ్రహాలు, 8 నావిగేషన్ ఉపగ్రహాలు, 21 భూమి పరిశీలన ఉపగ్రహాలు మరియు 3 సైన్స్ ఉపగ్రహాలు అన్నారుశాటిలైట్ ఎనేబుల్ డేటా సేవలు దేశంలోని వివిధ రంగాల ప్రయోజనాల కోసం ఉపయోగ పడుతున్నాయి. వీటిలో టెలివిజన్ ప్రసారం, డైరెక్ట్–టు–హోమ్, యఓ, మొబైల్ కమ్యూనికేషన్, టెలి–ఎడ్యు కేషన్, టెలి–మెడిసిన్ , వాతావరణం, తెగు ళ్లు, వ్యవసాయ–వాతావరణ శాస్త్రం సంభావ్య ఫిషింగ్ జోన్‌లపై సలహాలు ఉన్నాయి. ఉపగ్రహ డేటా పంట ఉత్పత్తి అంచనా, పంట తీవ్రత, వ్యవసాయ కరువు అంచనా, బంజరు భూముల జాబితా, భూగర్భ జలాల లభ్యత ప్రాంతాలను గుర్తించడం, లోతట్టు చేపల పెంపకం అనుకూలత, విపత్తు ప్రమాదాన్ని తగ్గించడం కోసం కూడా ఉపయోగ పడుతుంది. ఎాఖీా కార్యా చరణ అనువర్త నాలను మరింత మెరుగుపర చడానికి దేశంలో అభివృద్ధి చెందుతున్న కార్యక్రమాల ద్వారా వినియోగదారుల అవసరాలను తీర్చడానికి మరిన్ని ఉపగ్రహా లను ప్రయో గించాలని మంత్రిత్వ శాఖ యోచిస్తోంది. వాటి కార్యా చరణ వినిమ యం కోసం భాగస్వామ్య విభాగాలచే సూచనలను స్వీకరిం చారు.ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్ ద్వారా పొటెన్షియల్ ఫిషింగ్ జోన్ సముద్ర వాతావరణ ముందస్తు అంచనా , పంట విస్తీర్ణం–ఉత్పత్తి అంచనా, జాతీయ వ్యవ సాయ కరువు అంచనా పర్యవేక్షణ వ్యవస్థ ద్వారా మహలనోబిస్ నేషనల్ క్రాప్ ఫోర్ కాస్ట్ సెంటర్, (ఓనీంఉఈచి), ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా (ఓనీఇఈఉఅఅ) ద్వారా ద్వైవార్షిక ఫారెస్ట్ కవర్ అంచనా , సెంట్రల్ వాటర్ కమిషన్ (జల శక్తి మంత్రిత్వ శాఖ) చే నీటిపారుదల అవస్థాపన అంచనా, భాం´త వాతావరణ శాఖ (ఓనీఖూ) ద్వారా వా తావరణ అంచనాలు, భూగర్భ జలాల అంచనా తగిన రీఛార్జ్ స్థానాల మ్యాపింగ్ (జల్ శక్తి మంత్రిత్వ శాఖ), గ్రామీణ అభివృద్ధి మంత్రిత్వ శాఖ ద్వారా ఇంటిగ్రే టెడ్ వాటర్‌షెడ్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్ వంటివి..

తెలంగాణ ప్రభుత్వానికి ఎన్జీటీలో ఎదురుదెబ్బ

హైదరాబాద్, ఫిబ్రవరి 10:: తెలంగాణ ప్రభుత్వానికి ఎన్జీటీలో ఎదురుదెబ్బ తగిలింది. గౌరవెల్లి ప్రాజెక్టు పనులను నిలిపివేయాలని ఎన్జీటీ తీర్పును ఇచ్చింది. పర్యావరణ అనుమతులు లేకుండా పనులు చేపట్టవద్దని ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణ ప్రభుత్వానికి షోకాజ్ నోటీస్‌లను కేంద్రం ఇచ్చింది. షోకాజ్ నోటీసుపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని కేంద్ర పర్యావరణశాఖకు ఎన్జీటి ఆదేశాలు ఇచ్చింది. పర్యావరణ అనుమతులకు విరుద్ధంగా ప్రాజెక్టు పరిధిని విస్తరించారని సంయుక్త కమిటీ నివేదిక ఇచ్చింది. కమిటీ నివేదిక ఆధారంగా కేంద్ర పర్యావరణ శాఖ చర్యలు చేపట్టింది. శ్రీరాంసాగర్ వరద కాలువ ప్రాజెక్టులో భాగంగా గౌరవెల్లి రిజర్వాయర్ సామర్థ్యాన్ని తెలంగాణ పెంచింది. ప్రాజెక్టు పరిధిని పెంచలేదన్న తెలంగాణ వాదనను ఎన్జీటి తోసిపుచ్చింది. నివేదిక ఆధారంగా గౌరవెల్లి ప్రాజెక్టులో మార్పులు చేసినట్లు ఎన్జీటి గుర్తించింది. ఇప్పటికే 80శాతం పనులను తెలంగాణ పూర్తి చేసింది.

11 మందికి కారుణ్య నియామకాల పత్రాలు అందజేత

రామగిరి, ఫిబ్రవరి 10: పెద్దపల్లి జిల్లా సింగరేణి ఏపీఏ ఏరియాలో విధులు నిర్వర్తిస్తూ వివిధ అనారోగ్య కారణాల వల్ల మెడికల్ అన్‌ఫిట్ అయిన ఉద్యోగుల డిపెండెంట్లు 11 మందికి గురువారం జీఎం కార్యాలయంలో కారుణ్య నియామక పత్రాలను జీఎం ఎన్‌వీకే శ్రీనివాస్ అందజేశారు.

ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. 11 మందిలో ఒక మహిళకు కార్పొరేట్ ఏరియాకు మిగతా 10 మందికి ఏఎల్‌పీ ఏరియాలో పోస్టింగ్ ఇచ్చినట్లు తెలిపారు. సింగరేణిలో ఇంత మంచి ఉద్యోగం రావడం ఒక వరమన్నారు.

క్రమశిక్షణతో పని చేసి అధికారుల వద్ద మన్ననలు పొంది పదోన్నతుల ద్వారా జీవితంలో మరింత పైకి రావాలని, తద్వారా సింగరేణి సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు గౌతం శంకరయ్య, ఎస్‌వోటూ జీఎం బైద్య, డీవైపీఎం రవీందర్ రెడ్డ